సినిమా కార్యకర్తల కరదీపిక

(A Manual For Film Screening)

ప్రత్యామ్నాయ సినిమా వేదిక

(Forum for Alternative Cinema)

సినిమా కార్యకర్తల కరదీపిక

(A Manual For Film Screening)

చల్తీ తస్వీరే గ్రామీణ ప్రాంతాల్లో, చిన్న చిన్న పట్టణాల్లో, నగరాల్లో, విద్యాలయాల్లో మంచి సినిమాల సమిష్టి వీక్షణాన్ని ప్రోత్సహించే, అందుకు అవకాశం కల్పించే చొరవగల ఒక బృందం. భిన్న సినిమాల గురించిన ఆసక్తినీ, అభిరుచినీ ఆరోగ్యకరంగా పెంపొందిస్తూనే, సినిమాలపై దార్శనిక చర్చలకి తెరతీయటమనే ఆదర్శంతో ప్రజలతో కల్సి పనిచేస్తోంది.

మూలం : చల్తీ తస్వీరే టీం

తెలుగు : గౌరవ్

ప్రచురణ : ప్రత్యామ్నాయ సినిమా వేదిక (Forum for Alternative Cinema)

ఆగష్టు 2019

© కాపీలెఫ్ట్

ఇందులోని అభిప్రాయాలన్నింటితోనూ అనువాదకుడు అంగీకరించనవసరం లేదు.

ప్రతిపాదిత విరాళం : రూ. 20/-

ప్రతులకు : 9032094492

వివరాలకు : gouravmeka@gmail.com

చల్తీ తస్వీరే సంస్థ వివరాలకు :

జి.-46, మొదటి అంతస్తు, గ్రీన్ పార్క్ (మెయిన్)

న్యూఢిల్లీ - 110016

Email : chaltitasveerein@gmail.com

www.chaltitasveerein.wordpress.com

అనువాదకుడి మాట

కాశ్మీర్‌లో 40 మంది సైనికుల్ని చంపారనే నెపంతో మొత్తం పాకిస్తాన్‌పై యుద్ధం చేయాలంటూ ఏకంగా వామపక్ష సంఘాలు మొదలుకుని అభ్యుదయవాదుల వరకూ ప్రజల్లో ఉన్మాదాన్ని రెచ్చగొడుతున్నప్పుడు యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో అదే పనిగా నిరంతరంగా నా ప్రచారోద్యమం సాగింది. ఆ నేపథ్యంతో దేశంలోని విశాల దృక్పథంతో విభిన్న రంగాల్లో పనిచేస్తున్న సామాజిక కార్యకర్తలు, ఆలోచనాపరులందరితో సాంస్కృతిక పునర్వికాసం కోసం **'రినైజాన్స్'** వాట్సప్ గ్రూపుని ఏర్పాటుచేసి నడుపుతున్నాం. 2018 ఫిబ్రవరి 14న సినిమా కార్యకర్తల సంఘం **చల్తీ తస్వీరే** రూపంలో గ్రామీణ ప్రజల దగ్గరకు వెళ్ళి ప్రత్యామ్నాయ సినిమాల్ని పరిచయం చేసిన సరిగ్గా సంవత్సర కాలానికి 'రినైజాన్స్' రూపొందింది. **'ప్రత్యామ్నాయ సినిమాలు (దృక్పథాలు – దృక్కోణాల)'** గ్రంథానికి తెలుగు రాష్ట్రాల్లో తిరుగులేని స్పందన వచ్చింది. నేను రాజస్థాన్ వర్క్‌షాప్‌లో ఉండగానే **'సంగమం'** ఆధ్వర్యంలో మిత్రులు మండపేటలో పుస్తకావిష్కరణ చేసారు. అంతకుముందే ట్రాన్స్‌జండర్ల ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞానకేంద్రం, హైద్రాబాద్‌లో **తెలంగాణ ప్రజాసాంస్కృతిక కేంద్రం** ఆవిష్కరణ చేపట్టింది. ప్రపంచంలో కథ కోసం ప్రత్యేకంగా భవనం నిర్మించిన కాళీపట్నం రామారావు (కారా) మాష్టారి చేతుల మీదుగా **కథానిలయం** చరిత్రలో మొట్టమొదటిసారి ఒక ట్రాన్స్‌జెండర్ ముఖ్య అతిథిగా శ్రీకాకుళంలో ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగితే, కోల్‌కతాలోని టిటాఘడ్‌లో **ముందడుగు** సంస్థ ఆధ్వర్యంలో ఈ పుస్తక పరిచయ కార్యక్రమం జరిగింది. వారందరికి కృతజ్ఞతలు. దేశవ్యాప్తంగా దృశ్యమాధ్యమ రంగంలో కృషిచేస్తోన్న, చేయాలనుకుంటున్న యువతతో రాజస్తాన్‌లోని భీమ్ దగ్గర్లో **'స్కూల్ ఫర్ డెమోక్రసీ'** (ప్రజాస్వామ్య పాఠశాల)లో జరిగిన మూడ్రోజుల కార్యశాల (వర్క్‌షాప్)లో తీసుకున్న వాళ్ళు ప్రచురించిన రెండు చిన్ని బుక్‌లెట్లకి నా అనువాదం ఇది. తెలుగు రాష్ట్రాల్లో సినిమాని ఉద్యమరూపంగా ఎంచుకున్న కార్యకర్తలకి ఇది రవంత ఉపయోగపడ్డా ఈ కృషి సార్థకం అయినట్లే. సాంస్కృతిక రంగంలో ప్రపంచవ్యాప్తంగా పెనుమార్పులు చోటుచేసుకుంటున్న ఈ కాలంలో సామాజిక మార్పుకిగానూ నూతన ప్రవంతుల్ని గుర్తించాల్సిన సమయం ఆసన్నమైందనే నా ఆలోచన. అనువాదంలోని పొరపాట్లకూ, వాక్య సమన్వయ లోపాలకు నాదే బాధ్యత. ఇటువంటి మరిన్ని ప్రయత్నాలు జరగాలని ఆశిస్తూ, ఈ చిన్ని పుస్తకాన్ని ప్రచురించడానికి ప్రోత్సాహాన్నిచ్చిన మిత్రులు, శ్రేయోభిలాషులందరికీ ప్రత్యేకాభినందనలు తెలుపుతూ, సెలవ్.

– గౌరవ్, పిఠాపురం

అంకితం

ఖెజర్లీ గ్రామం రాజస్తాన్‌లోని జోధ్‌పూర్ దగ్గర్లో ఉంటుంది. 1730లోనే అక్కడి 83 గ్రామాల బిష్ణోయ్ తెగ ప్రజలు 363 మంది చెట్ల నరికివేతను అడ్డుకొని ప్రాణత్యాగం చేసారు. కూల్చబడే వృక్షాలకంటే కూలుతున్న దేహాలు గొప్పవి కావనే మహత్తరమయిన ఆదర్శమే అమృతాదేవి బిష్ణోయ్‌ని ముందుకు నడిపింది. చిప్కో మొదలైన పర్యావరణోద్యమాలకి దిక్సూచి ఉద్యమం ఇదే.[1]

ఖైర్లాంజీ గ్రామం మహారాష్ట్రలోని బాంద్రా దగ్గర ఉంది. 2006లో అగ్రకులాహంకారం బుసకొట్టి దళితుల్ని క్రూరంగా బలితీసుకోవడమే కాక దళిత మహిళల మీద అగ్రవర్ణ దురహంకార పురుషాధిక్యత చిత్రహింసల లైంగిక దాడిచేసి వికృతానందం పొందింది. ఆధునికత పేరుతో జబ్బలెంతగా చరుచుకున్నా అంతర్గతంగా పెట్రేగుతున్న కులజాఢ్యానికి ఈ ఉదంతం తిరుగులేని ఉదాహరణ.

అభివృద్ధి పేరిట జరుగుతున్న విధ్వంసం, అణిచివేతలో భాగంగా ఆదివాసీ దళిత బహుజన మైనారిటీలపై సాగుతున్న హత్యాకాండలకి నిరసనగా,

ప్రపంచంలోనే ప్రథమ పర్యావరణోద్యమకారులైన ఖెజర్లీ వీరత్వానికీ,

ప్రపంచంలో ఎక్కడా లేని కులవ్యవస్త జాడ్యానికి బలై ఆత్మగౌరవ పోరాట చిహ్నాలైన ఖైర్లాంజీ త్యాగానికీ,

ప్రజల కోసం ప్రాణాలొదిలిన అమరుల ప్రతీ రక్తపుబొట్టూ ప్రతిధ్వనించేలా,

సమాజహితం కోసం సమిష్టి ఆశయ సాధనలో అశువులు బాసిన అనామధేయులందరికీ...

అకళంకిత ప్రేమతో

ఆత్మీయంగా

ఈ

అక్షర స్మృతినిలా...

***

వెళ్తూ వెళ్తూ...

రాజస్థాన్‌లోని మారుమూల గ్రామంలో కిందటేడాది మార్చి నెలలో ఒక చిన్న కమ్యూనిటీ హాలులో సినిమా చూపించి సామాన్లు సర్దుకుంటున్నాం. ఇంతలో బుల్లిపాప ప్రాజెక్టరు దగ్గరకి బుడిబుడిగా నడిచొచ్చి అందులోకి తొంగిచూస్తూ, "టీవీ లేకుండా ఇందులోనుంచి గోడమీదికి బొమ్మలెలా వస్తున్నాయ్?" అనడిగింది.

'చల్తీ తస్వీరే' చేసిన మొదటి విడత సినిమా యాత్రలో ఈ బుజ్జాయి వంటి ఎన్నో ఔత్సాహిక సూక్ష్మ ప్రశ్నలు మాకు ఎదురయ్యాయి. వాళ్ళ స్కూలుకో, ఊరికో, బస్తీకో మేమెందుకొచ్చాం, ఎలా వచ్చాం, ఈ సినిమాలే ఎందుకు ప్రదర్శిస్తున్నాం. మరో రకమైన సినిమాలనెందుకు ప్రదర్శించడం లేదు, ఇదంతా చేయడానికి మాకు డబ్బులెవరు ఇస్తున్నారు? ప్రతీచోటా ప్రదర్శనానంతరం ఈ విషయాలన్నీ జనాలకు వివరించే వాళ్ళం. వివిధ సంఘాలు, ఐక్యవేదికలు, యూనియన్‌ల సహాయ సహకారాలతో మాత్రమే మా ప్రయాణం కొనసాగుతోందని వివరించడానికి ప్రయత్నించేవాళ్ళం. దేశంలో ఉన్న సాధారణ సినిమా వీక్షక దృష్టినీ, నిర్మాణాన్నీ ప్రశ్నించి, సవాలు చేయాలనుకున్న కొద్దిమంది మిత్రుల కలయికే ఈ కార్యక్రమానికి ప్రేరణ అని తెలిపేవాళ్ళం. ప్రధాన స్రవంతి యొక్క రాజకీయార్థిక బంధనాల్లో చిక్కుకునున్న సినిమాల్ని **'విముక్తి'** చేయాలనేదే నిజానికి మా ప్రధాన ఆలోచన. గతంలో సాధ్యమవని, ప్రత్యామ్నాయ ఆలోచనలు చొరబడని ప్రదేశాల్లో స్వతంత్ర చిత్రాలని ప్రదర్శించడం, సినిమాలు తీసే సాంప్రదాయ ఫిల్మ్‌మేకర్ల పద్ధతికి భిన్నమైన చూసే సంస్కృతి నిర్మించడం దీనికి మూలం.

ఈ ప్రదర్శనలు వీక్షకులకి సినిమాలని స్వతంత్రంగా విమర్శనాత్మక దృష్టితో ఎలా చూడాలో చెబుతాయి. సినిమా మాధ్యమం గురించిన నిర్మాణాత్మక దృక్పథాన్ని పెంపొందించడానికి తోడ్పడతాయి. ఈ ప్రయాణంలో ప్రదర్శించేందుకు ఎంపిక చేసిన సినిమాలన్నీ చల్తే తస్వీరే సలహామండలి మొదలు మా మిత్ర సంస్థల పెద్దలందరితో సినీరంగ ప్రేమికులతో వివిధ దఫాలు చర్చించి నిర్ణయించబడినవే. తొమ్మిది ఉత్తర భారత రాష్ట్రాల్లో అరవై ప్రదేశాల్లో అంటే, స్కూళ్ళు, వీధులు, గ్రామ పంచాయితీ కార్యాలయాలు, గ్యారేజ్‌లు, బస్తీలు, కాలేజీలు, యూనియన్ ఆఫీసులు, అంగన్‌వాడీలు, ఫ్యాక్టరీ కార్మిక వాడలు, సముద్ర తీరప్రాంత గ్రామాల్లో చల్తీ తస్వీరే ప్రదర్శనలతో సినిమాని ప్రజల్లోకి తీసికెళ్ళడానికి అనేక ప్రయత్నాలు చేసింది.

సామాజిక రంగంలో మార్పుకోసం చేసే ప్రయత్నాల్లో సినిమా మాధ్యమం ఎంత శక్తివంతమయిన పాత్ర నిర్వహించగలదో ఈ యాత్ర మరోసారి తేటతెల్లం చేసింది.

అపారమయిన అవకాశాల్ని మా ముందు పెట్టి కళ్లు తెరిపించింది. అయితే, మాకెదురయిన అనుభవాలు అన్నీ ఆశావాహంగానే ఉన్నాయని చెప్పలేం. ఈ యాత్ర వివిధ ప్రశ్నలు, సవాళ్ళను కూడా మా ముందుంచింది. విస్తృతమయిన సాధనంగానున్న సినిమా, శక్తివంతమయిన మాధ్యమంగా సౌకర్యాలతోపాటూ ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలని కూడా తెరమీదికి తెచ్చింది. అవాస్తవాలతో కూడిన వార్తల వ్యాప్తి, వీక్షకుల సంఖ్య, ఆసక్తి మొదలైనవి. సంకుచితమయిన సాంకేతిక మాధ్యమాల పుణ్యమా అని ఇప్పటికే సమాజంలో ప్రమాదకరమైన ధోరణులు పెట్రేగిపోతున్నాయి. అపరిచితుల పట్ల అవాంఛనీయమయిన అనుమానం, స్త్రీల పట్ల చులకనభావం, విద్వేషం, హింసలకి దారితీసే విధంగా ఇవి ప్రభలుతున్నాయి. ప్రధాన ప్రవంతి టి.వి. ఛానళ్ళు ప్రసారం చేసే వార్తలు, వివరాలు, అలాగే సామాజిక మాధ్యమాలలో వచ్చే సమాచారం పట్ల విమర్శనాత్మక దృష్టి కోణాన్ని పెంపొందించుకోవాల్సిన అవశరం ఉందని మా బృందం చెప్పేది.

ఆ విధంగా మా రెండో విడత ఫిల్మ్‌ఫెస్టివల్ ప్రయాణం నిపుణులయిన నిర్వాహకుల ఆధ్వర్యంలో నిండుగా కనుల పండుగగా సాగింది. దృశ్యశ్రవణ సాధనాల్ని సామూహిక సంవాదాలకి వినియోగించుకుని ప్రదర్శన అనంతరం సమకాలీన వర్తమాన విషయాల గురించి చర్చను నిర్వహించే వాళ్ళం. ఈ కరదీపిక అలా రూపొందిందే.

ఇందులో పాఠకులకి సామూహిక సినిమా ప్రదర్శనకు అవసరమయిన సాంకేతిక అంశాలతోపాటూ, ఈ మొత్తం కార్యక్రమానికి వెన్నంటి ఉండే సామాజిక రాజకీయ పరిస్థితుల పట్ల అవగాహన కూడా ఎలా ఏర్పర్చుకోవాలో తెలుస్తుంది. చల్తీ తస్వీరే సంస్థతో భాగస్వామ్యం కల అనేకమందితో జరిగిన సంభాషణలు, సంవాదాల ఆధారంగానే ఈ వ్యాసాలు రూపుదిద్దుకున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్ని దృష్టిలో పెట్టుకుని సినిమా మాధ్యమాన్ని సమిష్టి శ్రేయస్సుకి ఉపయోగించే పద్ధతుల దిశగా ప్రజల్ని ప్రోత్సహించడమే దీని పరమార్థం. ఇందులోని కొన్ని వ్యాసాలు మా యాత్ర జరగడానికి ముందు సుమారు ముప్పై భాగస్వామ్య సంఘాలతో నిర్వహించిన వర్క్‌షాప్ (కార్యశాల)లో ఉపన్యసించినవి. వాటిని రాతరూపంలో పెట్టే పని కార్యశాల నిర్వహణలో పాలుపంచుకుని మా యాత్ర 45 రోజులు మాతోనే ఉన్న ఫాజియా తెహ్‌జీబ్‌గారు చేసారు.

ఇందులోని మొదటి వ్యాసం **'ప్రజలు – సినిమా'** సంజయ్ కాక్ రాసారు. భారతదేశంలో డాక్యుమెంటరీ చిత్రాల నిర్మాణరంగ చరిత్రని సంక్షిప్తంగా తడుముతూ, ప్రజానీకంతో వాటి సంబంధాలు, స్వతంత్ర సినిమా ప్రదర్శనల అవసరాన్ని చిత్రీకరించడం జరిగింది. సంజయ్ జోషి వ్యాసం **'సామూహిక ప్రదర్శనల్లో సంవాదాలు'** ఇదే విషయాన్ని

మరింత ముందుకు తీసికెళ్ళి, వీక్షకుల దృష్టికోణంతో ప్రదర్శనల్లో పాల్గొంటూ విస్తృమయిన దృక్పథం ఎలా ఏర్పర్చుకోవాలో పరిచయం చేస్తుంది. **'సామూహిక చలనచిత్రోత్సవానికి సన్నాహాలు'** అనే అమూదన్ వ్యాసం దీనినే అనుసరిస్తూ, నిర్దిష్టమయిన ప్రేక్షకుల కోసం ఎంపిక చేయాల్సిన సినిమాల గురించి, తన అనుభవాలను ఉటంకిస్తూ, దార్శనికమయిన వైఖరితో రాసింది.

సామాజిక పరివర్తనా సాధనాలుగా డాక్యుమెంటరీ చిత్ర ప్రదర్శనలు ఏ రకంగా ముఖ్యపాత్ర నిర్వహిస్తాయో ఆషా అచి జోసెఫ్ వ్యాసం వివరించింది. స్వతహాగా టీచరు, ఫిల్మ్‌మేకరు అయిన ఫాతిమా నసీరుద్దిన్ ఈ యాత్రలో వో రెండ్రోజులు ప్రయాణించారు. ఆ ప్రయాణానుభవాలు, అందులో ఎదురయిన సవాళ్ళూ, ప్రదర్శనల ద్వారా నేర్చుకున్న విషయాలను ఉదహరిస్తూ చాలా కీలకమయిన అంశాల గురించి ప్రస్తావించారు.

ఈ విశ్లేషనాత్మక వ్యాసాలతోబాటుగా ఫిల్మ్‌స్క్రీనింగ్‌లో చేయాల్సినవి, చేయకూడని పనుల జాబితాలను కూడా మేం ఇచ్చాం. యాత్రలో మా తప్పులు, మేం చేసిన పొరపాట్ల నుండి వీటిని సంగ్రహించాం. అదనంగా సాంకేతిక పరికరాలు, వస్తువుల జాబితా, సినిమా ప్రదర్శనలో ఇమిడి ఉన్న ఇతర సమాచారం గుర్తుంచుకోవాల్సిన ముఖ్యాంశాలు మొదలైనవి ఇచ్చాం.

సంచార చలనచిత్ర ప్రదర్శననేది బహుముఖ పాశ్వంతో కూడినది. ప్రతీ ప్రేక్షకుడిదీ ఇందులో ప్రత్యేక అనుభవమే. ఆ ఆలోచనతోనే స్వీయానుభవాల సమాహారంగా ఈ ప్రచురణను రూపొందించడం జరిగింది. ఈ ముద్రణకు ప్రధాన కారణం అదే. నిర్వాహకులు, అభ్యాసకుల మధ్య అప్పుడప్పుడు విరుద్ధమయిన అభిప్రాయాలు తలెత్తుతాయి. సినిమా ప్రదర్శన గురించి భిన్న భావాలను గుర్తించి, సమన్వయంతో ముందుకు సాగడం ప్రధానం. మా అనుభవంలో నేర్చుకున్నదేమిటంటే, ఏ సినిమానైనా పరిపూర్ణంగా, సంపూర్ణంగా వీక్షించడం, సమీక్షించడం సాధ్యం కాదు. అలా సినిమా మొత్తాన్ని సరిగ్గా అంచనా వేయగలిగే దగ్గరి దారులేవీ లేవు. అయినప్పటికీ ఈ చిన్ని ప్రయత్నం పాఠకులకి చిత్రప్రదర్శనల నిర్వహణకి సంబంధించిన గూడుపుఠాణీని విప్పి చెప్పి చదువరులకో స్పష్టతనిస్తుందని హర్షిస్తూ...

– అశ్వథీసేనన్ & సమీర్ గార్డ్‌నర్

***

1. ప్రజలు – సినిమా; సంక్షిప్త పరిచయం

– సంజయ్ కాక్

భారతదేశంలో మొదటిసారి 1940లో డాక్యుమెంటరీ సినిమాలు వచ్చాయి. అత్యధిక శాతం మంది భారతీయుల్ని రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొనేలా అంగీకరింపజేయాలనే ఎత్తుగడతో బ్రిటీష్ ప్రభుత్వం నిర్మించిన ప్రచార సాధనాలవి. యుద్ధంలో పౌరులుగానూ, సైనికులగానూ ఇండియన్లని ఉపయోగించుకొని, యుద్ధం మన భారతీయుల కోసం కూడా అని అనుకునే విధంగా మల్చడానికి నిర్మించిన చిత్రాలవి. 1947 స్వాతంత్ర్యం నాటికీ చిత్రం మారింది కానీ పూర్తిగా కాదు; డాక్యుమెంటరీలనేవి కొత్తగా గద్దెనెక్కిన ప్రభుత్వ ప్రయోజనాలకి అనుగుణంగా రూపొందేవి. అధికారంలో ఉన్నవాళ్ళ ప్రచారాలకి కట్టుబడి డాక్యుమెంటరీ చిత్రాల నిర్మాణం జరిగింది.

సుమారు పాతిక సంవత్సరాలపాటు సినిమా థియేటర్‌ల యజమానులు ప్రతీ సినిమా షోకి ముందు ప్రభుత్వ చిత్రాల్ని తప్పనిసరిగా వేసేవారు. పది నిమిషాలు ఉండే ఈ ప్రసారాలు, సోవియట్ ముఖ్యుల ఇండియా పర్యటన గురించో, పంజాబ్‌లో సాగుచేస్తున్న కొత్తరకం వంగడాల గురించో, లేపోతే క్రికెట్ టెస్ట్‌మ్యాచ్ గురించో, ఒలింపిక్స్ ఆటల గురించో ఉండేవి. వీటిని ప్రసారం చేయడం తప్పనిసరి మాత్రమే కాదు, వీటికి గానూ ప్రభుత్వానికి సినిమా హాళ్ళ యజమానులు రుసుము కూడా చెల్లించేవారు. ఈ సినిమాల్ని ప్రదర్శకులు, ప్రేక్షకులు కూడా బలవంతంగా రుద్దబడినట్లు చూసేవారు. ఈ విధానాల వల్ల ఇండియాలోని డాక్యుమెంటరీలు, వాటిని చూసే ప్రేక్షకుల మధ్య సంబంధం దెబ్బతినింది.

1975 జూన్ నెలలో తరుముకొచ్చిన ఎమర్జెన్సీ భారద్దేశ చరిత్రలో ఒక ప్రధాన అంశం. సాంస్కృతిక క్షేత్రంలో తప్పనిసరి చీలికకది దారితీసింది. మూడు దశాబ్దాలపాటు, కవులు, కళాకారులు, మేధోవర్గం జాతి నిర్మాణంలో ప్రధాన పాత్రదారులుగా ఊహించుకునేవారు, రాజ్యాన్ని ప్రశ్నించడమనేది అరుదుగా జరిగేది. కానీ ఎమర్జెన్సీ నెత్తినపడి అత్యవసర పరిస్థితి తర్వాత అప్పటివరకూ ప్రత్యేకంగా చూడబడిన పాత్రికేయులు, రచయితలు, మేధావులు ప్రభుత్వంతో వారి సత్సంబంధాలన్నీ సమస్యాత్మకంగా తయారయాయి. కొద్దిమంది సాంస్కృతిక కార్యకర్తలు ఈ రకమయిన పరిస్థితులకి లొంగి ఉండేవారు, చాలామంది జైళ్ళలో పెట్టబడ్డారు. ఫలితంగా రాజ్యంతో వారి సంబంధాలు శాశ్వతంగా చెడ్డాయని చెప్పొచ్చు.

ఆ సమయంలోనే ఆనంద్ పట్వర్ధన్, ఉత్పలేందు చక్రవర్తి, తపన్‌బోస్ వంటి చిత్ర నిర్మాణకర్తలు పౌరహక్కుల ఉద్యమంలో పాలుపంచుకుంటూనే సినిమాలు తీయడం

ప్రారంభించారు. ప్రిజనర్స్ ఆఫ్ కాన్షస్ (1977, పట్వర్ధన్) ముక్తిఛాయ్ (1977, చక్రవర్తి), యాన్ ఇండియన్ స్టోరీ (1980, బోస్) అలా వచ్చినవే. ఎమర్జెన్సీ తర్వాత అభివృద్ధయిన డాక్యుమెంటరీల చిత్రీకరణ సామాజిక ఉద్యమాలతో దగ్గరి సంబంధాలు పెట్టుకుని ముందుకు సాగింది. చిత్ర నిర్మాణకర్తలు కూడా క్షేత్రస్థాయిలో పనిచేసే



బలమయిన కార్యకర్తలతో మంచి సంబంధాలు ఏర్పర్చుకోగలిగారు. విధానపరమయిన సమస్యలు చిత్ర నిర్మాణంలో తలెత్తినప్పుడు, ఈ సినిమాల వెనుక రహస్య ఉద్దేశాలేవీ లేవనే భరోసాను ప్రజా ఉద్యమాలు ఇవ్వగలిగేవి.

మచ్చుకు ఒక ఉదాహరణ చూద్దాం : గడిచిన ఈ ఇరవై ఏళ్ళలో నర్మదాలోయలో నిర్మిస్తున్న భారీ డ్యాంలని వ్యతిరేకిస్తూ జరిగే పోరాటాల స్ఫూర్తితో దాదాపు, అరడజను చిత్రాలు నిర్మించడం జరిగింది. వీటివల్ల సామాజిక ఉద్యమాలకి ప్రయోజనం ఎంత చేకూరిందనేది అలా ఉంచితే, ఒక మంచి జర్నలిజం మాదిరిగా, ప్రయోజనకర ఫోటోగ్రఫీ (వియత్నాం యుద్ధంలోలాగా) లాగా ఈ సినిమాలు సమస్య తీవ్రతని గుర్తించి, ఆయా పోరాటాలకి అర్ధవంతమయిన మద్దతు ప్రకటించీ, ఆ మేరకు వాటి పాత్రను నిర్వహించాయి. ప్రజాతంత్ర ఉద్యమాలతో గల సంబంధాలు, యువతతో పరిచయాలు చిత్ర ప్రదర్శనల్ని కాలేజీలు, విశ్వవిద్యాలయాల్లో విస్తృతంగా నిర్వహించేందుకు కలిసొచ్చాయి. సినిమాల్ని చూపించే సంస్కృతి వ్యాప్తి చెందింది.

1980 దశకంలో సాంకేతిక రంగంలో కూడా పెనుమార్పులు వచ్చాయి. గతంలో సినిమా ప్రదర్శన మెల్లమెల్లగా సాగేది, పైగా బాగా ఖర్చుతో కూడుకున్నది. అందులోనూ రాజ్యం ఈ సినిమాలపై పెత్తనం చెలాయించాలని చూసేది. యుద్ధ సమయంలో సినిమాల ప్రదర్శనకు అనుమతులు తెచ్చుకోవాల్సి వచ్చేది. వ్యాపారాత్మక, వాణిజ్య ప్రసారాలకి అంతిబ్బంది లేకున్నా డాక్యుమెంటరీలకి ఉండేది. అంతిమంగా 'విడుదల' అవడానికి ముందుగా ప్రభుత్వ సెన్సారుబోర్డు అనుమతి అవసరం అయ్యేది.

1982 ఏషియన్ క్రీడోత్సవాల సమయంలో ప్రభుత్వరంగ సంస్థయిన దూరదర్శన్ మొదటిసారి రంగుల (కలర్) ప్రసారాల్ని ప్రారంభించింది. తర్వాత ఎన్నో పెనుమార్పులు వచ్చాయి. చిన్న చిన్న కెమేరాలు తెరంగేట్రం చేసాయి. కంప్యూటర్ ఎడిటింగ్ మొదలైంది. రాజ్యంతో సంబంధం లేకుండా, బొత్తిగా ప్రభుత్వ కనుసన్నల్లో కాకుండా సినిమాల్ని

నిర్మించడం డిజిటల్ పుణ్యమా అని తేలికయింది. ఈ మొత్తం ప్రభావం ఎంతోమంది ఫిల్మ్‌మేకర్ల మీదపడి సినిమా ప్రజాస్వామికరించబడటం మొదలయింది. డాక్యుమెంటరీల నిర్మాణంలోమరింతమంది పాలుపంచుకోసాగారు. ప్రజాసంఘాలు, ఎన్.జి.ఓ.లు. హఠాత్తుగా ఉద్యమాల్లో డాక్యుమెంటరీ చిత్రాల్ని ప్రదర్శించడం, ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఎంత విలువయిన కార్యక్రమమో గుర్తించాయి.

2002లో దేశంలోనే ప్రసిద్ధిచెందిన ముంబయ్ అంతర్జాతీయ డాక్యుమెంటరీ చిత్రోత్సవాల్లో, సెన్సారుబోర్డు క్లియరెన్స్ సర్టిఫికెట్ ఇచ్చిన సినిమాలే ప్రదర్శనకు అనుమతించడం జరుగుతుందనే ప్రకటన వెలువడింది. లక్ష్యం స్పష్టమే, స్వతంత్రంగా నిర్మితమైన కొత్త తరహా ప్రజాప్రయోజన ఉద్యమ చిత్రాలకి ఉన్న ఆ కొద్దిపాటి స్థానాన్ని, స్థలాన్ని లేకుండా చేయడమే ఈ ప్రకటన ముఖ్యోద్దేశం. వెనువెంటనే చిత్రనిర్మాణకర్తలంతా ఒక్కతాటిపైకొచ్చి ఈ అప్రజాస్వామిక చర్యకు నిరసనగా మరో ప్రత్యామ్నాయ చిత్రోత్సవాన్ని నిర్వహించీ, దానికి 'వికల్ప్' అనే పేరు పెట్టారు. ముంబై ఫిల్మ్ ఫెస్టివల్ జరుగుతున్న చోటనే రోడ్డుమీద జరిగిన ఈ వికల్ప్ చిత్రోత్సవం ప్రభుత్వం నిర్వహించిన దానికంటే ఊహించనంత గొప్పగా

విజయవంతం అయింది! ఆ సందర్భంగా ప్రదర్శించిన డాక్యుమెంటరీలు, లఘు చిత్రాలకు మీడియాతోపాటు ప్రజాదరణ కూడా లభించింది. ఒక మాదిరి గది, కొన్ని సినిమాలు, ఒక ప్రొజెక్టరు ఉంటే చిత్రోత్సవాలు చేయడం కష్టమేమీ కాదనే భావన ప్రజల్లో సైతం కలిగింది. వెనువెంటనే మధురై నుండి మొదలై గోరఖ్‌పూర్ వరకూ అనేక చిత్రోత్సవాలు దేశమంతా జరిగాయి. తర్వాత కాలంలో కొన్ని ప్రాంతాల్లో ఇవి చప్పబడ్డప్పటికీ, దేశంలోని భిన్న ప్రాంతాలలో ఇవి ప్రత్యామ్నాయ సంస్కృతిని మాత్రమేకాక, భిన్నత్వాన్ని స్వాగతించే ప్రేక్షకుల సంఖ్యను కూడా గణనీయంగా పెంచాయి. మూసలో సాగుతున్న సాధారణ వాణిజ్య సినిమాలకి విరుద్ధమయిన కొత్తతరహా సమాంతర కథల్ని ఇవి ప్రవేశపెట్టాయి.

ఈరోజు ఫీచర్ ఫిల్మ్‌లు, డాక్యుమెంటరీల మధ్య పరిస్థితులు చెడి వ్యత్యాసాలు పెరుగుతున్నాయి. నిజానికివి వాణిజ్యపరమయిన వ్యాపారాత్మక చిత్రాలు, వాటికి భిన్నమయిన లాభాపేక్షలేని చిత్రాల మధ్యనుండే విభేదాలే. వ్యాపార చిత్రాలు అత్యధిక శాతం మంది దరికి చేరాలనే లక్ష్యంతో నిర్మించబడతాయి. సినిమా ఇండస్ట్రీ ప్రభుత్వంతో చిక్కుముడులు పెట్టుకోవాలనుకోదు. ఏం చేసినా, చివరికది వ్యాపారమేననే దృష్టి దానికి ముఖ్యం. అస్తిత్వంలోనున్న సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితుల్ని ప్రశ్నించే చేవ లాభాపేక్షలేని చిత్రాలకే ఉంటుంది. ఇంకా కచ్చితంగా చెప్పాలంటే, డాక్యుమెంటరీల్లోనే ఎక్కువ. డాక్యుమెంటరీలకీ, మనం బతుకుతున్న పరిస్థితులకి, ప్రేక్షకులకి గల సంబంధం,

ప్రశ్నించే చైతన్యాన్ని కల్పించి ఒక సామూహిక క్రియాశీల వ్యవస్థను నిర్మించుకోడానికి తోడ్పడుతుంది.

మనం ఎప్పుడయితే చిత్ర ప్రదర్శనలో భాగమౌతామో అప్పుడు ప్రశ్నించడానికి మనకంటూ ఒక చోటుంటుంది. సినిమాలని ప్రతి ఒక్కరూ వారిదైన ప్రత్యేక దృష్టితో చూస్తారు కాబట్టి ప్రతీ ప్రశ్నకి దానిదైన ప్రాధాన్యతుంటుంది. ప్రజలు సమిష్టిగా సినిమాలు చూసి, తదనంతర చర్చల్లో పాల్గొన్నప్పుడే ఈ వైవిధ్యం సాధ్యమవుతుంది. ఇలాంటి సందర్భాల్లోనే ప్రేక్షకులకు చిత్ర నిర్మాణకర్తల్ని వారి సినిమాల్ని గురించి స్వేచ్ఛగా ప్రశ్నించే వీలుంటుంది. బహుశా డాక్యుమెంటరీలో ఉండే సౌలభ్యం అదే. ఏం చూపించారో, ఏమేం వదిలేసారో ఆలోచించేలా ప్రజల్ని డాక్యుమెంటరీ ప్రేరేపించగలదు.

ఏ సినిమా గొప్పతనమయినా అది ప్రదర్శించబడిన విధానంపై ఆధారపడి ఉంటుంది. ప్రత్యక్షమయిన ఒక మధుర గానం సంగీత ప్రియుల్ని అలరించినట్టుగానే, ప్రేక్షకులని సినిమా పరవశింపజేస్తుంది. చిత్రనిర్మాణకర్తలు, ఇతర చలనచిత్ర ప్రేమికులందరితో భావాలు పంచుకునే అవకాశం కల్పిస్తుంది. నిర్దిష్టమయిన సిద్ధాంతాల్ని సినిమా ద్వారా చెప్పే విధానం, ఈ రంగానికి గల రాజకీయ కోణాన్ని కూడా చూపెడుతుంది. సినిమాకి గల శక్తివంతమయిన ప్రభావాన్ని మరింత విస్తృతపర్చే వీలుంది. ముఖ్యంగా, యువత వారి నిరసన స్వరాల్ని బలంగా వ్యక్తీకరించేందుకు మంచి మాధ్యమం ఇది. సాంకేతిక సాధనాలు, కొత్తతరహా సినిమాని ప్రేక్షకులకి పరిచయం చేయడం, సినిమాని గురించిన చర్చలు, సంభాషణలు, ప్రదర్శనల సంఖ్య, ఎంపిక చేసుకున్న భిన్న చిత్రాలు ఇవన్నీ మొత్తం సినిమా ప్రదర్శనపై వేటికవిగా ప్రభావం చూపుతాయి.

బెంగాల్‌లోని వివిధ ప్రాంతాల్లో సినిమాలు జనాలకి చూపిస్తూ కృషిచేస్తోన్న కోల్‌కతాలోని పీపుల్స్ ఫిల్మ్ కలెక్టివ్ ప్రచురించిన 'టూవార్డ్స్ పీపుల్స్ సినిమా' పుస్తకంలోని ఉటంకింపుతో ముగిస్తా,

"సినిమాకానీ, డాక్యుమెంటరీకానీ వాటికవే అసమ్మతి స్వరాలో, నిరసన రూపాలో కాకపోవచ్చు. కానీ, వాటినెలా ప్రదర్శించారు, ఎలా వీక్షించారు – ఆ సమయం, స్థలం, సందర్భం, పరిస్థితులు, ఇంకా నిర్వాహకులు – ప్రేక్షకుల మధ్య సంబంధాలు ప్రముఖపాత్ర పోషిస్తాయి. ఒక సినిమా వల్ల వీక్షకుల్లో ఎంతటి చురుకయిన స్పందన కలుగుతుందనేది ఇవన్నీ కలిసే నిర్ణయిస్తాయి."

(చల్తీ తస్వీరే సంచార చలన చిత్రోత్సవం 2018లో జరిగిన
కార్యశాల నుండి తీసుకోబడింది.)

***

2. సమిష్టి ప్రదర్శనలు – సంవాదాలు

– సంజయ్ జోషి

గడిచిన దశాబ్దాల్లో చలనచిత్ర ప్రదర్శన బాగా వృద్ధి చెందింది. మొట్టమొదటి చిత్రోత్సవం 1932లో వెనిస్‌లో జరిగింది. నాటి నుంచీ చలనచిత్రోత్సవాలు మంచి సినిమాలకు వేదికగా మారాయి. డెస్క్‌టాప్‌లోనో, లాప్‌టాప్‌లోనో ఒక సినిమా చూడటంకంటే నిశబ్దమయిన చీకటి వాతావరణంలో అందరితో కలిసి సినిమా చూడటం భిన్నమైంది. అలాగే ఆదరాబాదరాగా సినిమా చూసేకంటే నటులు, నిర్మాణకర్తల ఆధ్వర్యంలో సినిమా చూడటం మరో అనుభూతిని ఇస్తుంది. ఈ వ్యాసంలో అలా సమిష్టిగా అందరితో సినిమా చూడటం, తర్వాత చర్చల్లో భాగమవడం గురించి నేను విశ్లేషించాను.

సంవాదాల ప్రాముఖ్యత : ప్రధాన స్రవంతి థియేటర్‌లో సినిమా అనేదొక సరుకు. అక్కడ జరిగే ప్రదర్శనల ప్రధాన ఉద్దేశం ఆ సరుకుని వీలయినంత ఎక్కువమందికి అంటగట్టి సొమ్ము చేసుకోవడమే. జరిగే ప్రదర్శనల సంఖ్య సరాసరి లాభాలార్జించడంపైనే ఆధారపడి ఉంటుంది. కాబట్టే, కుదిరినన్ని ఎక్కువ ప్రదర్శనలు వేయడంతోబాటూ సినిమా సరుకుకి కొసరుగా కూల్‌డ్రింకులు, పాప్‌కార్న్‌లు ఇతర తినుబండారాల్ని కూడా వ్యాపారం చేయడం జరుగుతుంది. కాబట్టీ, అలాంటి థియేటర్లలో అర్థవంతమయిన సినిమాల్ని ఆశించడం అత్యాశే. ఈ విధమైన ప్రధాన స్రవంతి సినిమాలకి విరుద్ధంగా, ప్రెస్ కాన్ఫరెన్స్‌లు, మార్కెటింగ్ జిమ్మిక్కులకి అతీతంగా స్వతంత్ర సినిమా ప్రదర్శనలు, సమిష్టి చిత్రోత్సవాలు ఆకర్షణీయతను సంతరించుకుంటాయి. ప్రదర్శనానంతర సంవాదాలు సైతం ముఖ్యపాత్ర పోషిస్తాయి. ప్రధాన స్రవంతి థియేటర్లలో అర్థవంతమయిన సంవాదాలు సుమారు అసాధ్యం, ఎందుకనంటే అక్కడ సినిమా అనేది వినిమయదారీ సరుకుగా కుదించబడి లాభార్జనే లక్ష్యంగా నడిచేది కనుక.

సంవాదం సినిమా చూడటాన్ని విశాలం చేస్తుంది. దృశ్యాల్ని కేవలం చూసి బుర్రలోంచి తుడిచేయకుండా దాంట్లో కథనాన్ని మననం చేసుకోవడం మంచి అనుభవం అవుతుంది. అంతేకాదు, ఒకే దృశ్యాన్ని అనేకమంది అనేక కోణాల్లో విశ్లేషిస్తుంటే వినడం సమిష్టి అనుభూతి కలిగిస్తుంది. ఇదెలా సాధ్యమో ఒక వ్యక్తిగత అనుభవం చెబుతాను : నాలుగవ ఉదయ్‌పూర్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో, రెండోరోజు సుబ్రతో కుమార్ సాహు తీసిన ప్లెమ్స్ ఆఫ్ ఫ్రీడం (1991) అనే సినిమాని 'సినిమా ఆఫ్ రెసిస్టెన్స్' ప్రచారంలో భాగంగా ప్రదర్శించాం. ఒడిస్సాలోని కల్హండీ జిల్లాలోని ఇచ్ఛాపూర్ గ్రామంలోని సామాజిక స్థితిగతులూ, మార్పుకు లోనయిన క్రమం ఆ సినిమా కథాంశం. ప్రశాంతంగా పచ్చదనంతో

కళకళలాడే ఆ గ్రామం 'డొసరి' అనే ఆదివాసీ దేవతని స్థానిక ఆధిపత్య బ్రాహ్మణీయ శక్తులు స్వాధీనం చేసుకుని కుట్రపూరితంగా వ్యవహరించి ఆ ఆలయానికి ఆదివాసీలు వెళ్ళడాన్ని వ్యతిరేకించడంతో గ్రామ వాతావరణం వేడెక్కిన దృశ్యాల చిత్రీకరణ అది. 80 నిమిషాల సినిమా అనంతరం చర్చలకై సమయం కేటాయించబడింది. టీ విరామాన్ని చర్చల కోసం వినియోగించుకోవాల్సిందిగా ప్రేక్షకుల్ని నిర్వాహకులు కోరారు. అంతే, టీ తాగే ప్రదేశం సమావేశస్థలిగా మారిపోయింది.

ఆ ముందురోజే ఉన్నావ్ దళిత అత్యాచార వ్యతిరేక కమిటీ సభ్యుడు జయేష్ సోలంకీ గుజరాత్‌లో దళితులపై జరుగుతున్న దాడుల్ని గురించి చర్చను లేవనెత్తారు. ఆ నేపధ్యంతో ప్రేక్షకులు సోలంకీ మాటల్ని మననం చేసుకుంటూ ప్లెమ్స్ ఆఫ్ ఫ్రీడం గురించిన చర్చల్లో మునిగిపోయారు. కులాహంకారానికి సంబంధించిన గుజరాత్, ఒడిస్సా ప్రాంతపు విశ్లేషణల్ని ఒకదానితో ఒకటి పోల్చుకుంటూ వాట్ని అర్థం చేసుకునేందుకు ప్రయత్నించారు. విస్తృతమయిన భౌగోళిక పరిస్థితులు కనుక లేకపోతే ఇది సాధ్యం కాదు. సినిమాలు ఇందుకు ఖచ్చితంగా సహకరించే మాధ్యమాలనేది నిస్సందేహం.

డాక్యుమెంటరీ చిత్రాల ప్రాధమిక లక్ష్యం అటువంటి సంవాదాల్ని ప్రేరేపించడమే. ఎందుకనంటే, డాక్యుమెంటరీలు సమాజంలోని సమస్యలని గుర్తించడమే కాదు, వాట్ని నిర్దిష్టమయిన రీతిలో వ్యాఖ్యానించగలవు కూడా. ఆ వ్యాఖ్యలే ప్రేక్షకుల్లో చర్చను మరింత ముందుకు తీసుకెళ్ళేందుకు తోడ్పడతాయ్.

చర్చల్లో ప్రజల భాగస్వామ్యం :

ప్రేక్షకులు అర్థం చేసుకోగలిగే సినిమా గురించి మాత్రమే చర్చించగలుగుతారనేది స్పష్టం. అయితే కొన్నిసార్లు అనేక కారణాల వల్ల ప్రేక్షకులు సినిమాతో మమేకం కాలేరు. భాష, నేపధ్యం, అపరిచితమయిన శైలి, సినిమాలోని కళాత్మకత కూడా ఒక్కోసారి సినిమాకి వార్ని దూరం చేయొచ్చు. వీటిల్లో మనం పెట్టే ప్రత్యేక దృష్టివలనే ప్రేక్షకులకి సంబంధిత విషయం అర్థమై ప్రభావం చూపుతుంది.



ఏలాగో కొన్ని ఉదాహరణలు చూద్దాం : 2017 మార్చి 25, 26 తేదీల్లో మేం గోరఖ్‌పూర్ చిత్రోత్సవాల్ని నిర్వహించాం. కొత్త తరహాగా సినిమాల్ని చూపించడమే ఈ కార్యక్రమ ముఖ్యోద్దేశం. హోలీ కౌ

(2016) అనే డాక్యుమెంటరీ గోమాంస నిషేధ సంబంధిత నేపథ్యంతో సి.వి. సత్యన్ తీసారు. జంతుబలుల చుట్టూతా అల్లుకుని ఉన్న మత, సామాజిక, ఆర్థిక, రాజకీయ, న్యాయపరమయిన అనేక అంశాల్ని ఈ చిత్రం ప్రస్తావిస్తుంది. చిత్రోత్సవంలో ఈ సినిమాని గురించిన పరిచయం సైబిల్ కె. వినోదన్ చేయాలని ముందుగానే అనుకోవడం జరిగింది. ఆయన ఢిల్లీలోని అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో రాజనీతిశాస్త్ర ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఇంగ్లీష్ ఉపశీర్షికలతో గల ఈ సినిమా కాపీని తనతో వెంట తెచ్చుకున్నారు. మూల సినిమా మళయాళంలో ఉన్నదయినా, ఇంగ్లీష్ సబ్ టైటిల్స్ కూడా ప్రధానమే. అయితే, సాంకేతిక లోపం కారణంగా సబ్‌టైటిల్స్ రాలేదు. చిత్రోత్సవ టీం అక్కడికక్కడే సినిమా మొత్తాన్ని అనువదించాలని నిర్ణయించింది! సైబిల్ మధ్య మధ్య సినిమాని ఆపి హిందీలో ప్రేక్షకులకి అనువదించి చెప్పాడు. ఇదెంతగా విజయవంతం అయిందంటే, సబ్‌టైటిల్స్‌తో చూసినప్పటికంటే ఎంతో బాగా ప్రేక్షకులు సినిమాని అర్థం చేసుకోగలిగారు.

ఈ విజయానికి రెండు కారణాలున్నాయి. మొదటిది ప్రదర్శన సమయంలో సెల్‌ఫోన్లు ఏవీ మోగకపోవడంతో అనువాదం హృద్యంగా సాగిపోయింది. రెండోది, నిర్ణీత సమయాన్ని మించి ప్రేక్షకులు చర్చల్లో పాలుపంచుకున్నారు. ఇది మా నిర్వాహకులందరికీ ముఖ్యమైన పాఠం. పరస్పర భావవ్యక్తీకరణను ప్రోత్సహించే ఈ విధానంపై మరింత దృష్టిపెట్టాలి.

ప్రేక్షకులకి అపరిచితమయిన పరాయి భాషా సినిమాల్లో ఇంగ్లీష్ సబ్‌టైటిల్స్‌పై తప్పనిసరిగా ఆధారపడనవసరం లేదు. వీడియోలు చూసే అలవాటున్న ప్రేక్షకులకి మాత్రమే అవి ఉపయుక్తంగా ఉంటాయి. ప్రత్యక్షంగా సినిమాని అనువదించి చెప్పడం అనేక సందర్భాల్లో ఎక్కువ ప్రభావం కలిగిస్తుంది. మరో దారేంటంటే, సినిమా వాల్యూమ్‌ని బాగా తగ్గించి తెరమీదొచ్చే సంగీతంతో అన్వయించుకుంటూ అనువదించగలగడం. అనువాదకులు సినిమాకి అనుగుణంగా నిపుణతతో వ్యవహరించడమే ఇందులో ప్రధానం. ఒక్కసారి ఇది పట్టుబడితే, సినిమా ప్రదర్శనలకి అప్రయత్నంగానే విలువ లభిస్తుంది. నా అనుభవంలో, వారు తీసిన సినిమాల్ని మరొకరు అనువదించడంలో సమస్యలెదురైన ఒక్క చలన చిత్ర నిర్మాణకర్తని కూడా నేనైతే చూడలేదు. విషయం అత్యధిక శాతం మంది ప్రేక్షకులకి అర్థవంతంగా అందుతోందా, లేదా అని మాత్రమే.

మరో పద్ధతేంటంటే సినిమా సారాంశాన్ని భాగాలుగా ప్రేక్షకులకి చూపించడం. పూర్తిగా అపరిచిత చిత్రాల విషయంలో ఈ పద్ధతి ఉపకరిస్తుంది. ఉదాహరణకి ఆర్.పి. అమూదన్ తమిళంలో తీసిన షిట్ (2003) డాక్యుమెంటరీని మేము ఉత్తర భారతంలో

అనేక చోట్ల చూపించాము. మానవ మలాన్ని చేత్తో శుభ్రం చేసే పారిశుద్ధ్య కార్మికులు, సఫాయివాలాల గురించిన ఆ సినిమాని చూపించి ఉత్తర భారతంలో ఉండే పాఠశాల విద్యార్థుల్ని తమిళం గురించి మీకేం తెల్సునని ప్రశ్నించేవాళ్ళం. సినిమాలోని వివిధ భాగాలను వారికి చూపిస్తూ, స్థానిక వాతావరణంతో వాళ్ళు దానిని అన్వయించుకుని ఆలోచించుకునేలా ప్రేరేపించడం చేసాం. ఇలాంటి చిత్రాల్ని ప్రదర్శించడంలో ముఖ్యోద్దేశం ఏమిటంటే, దేశంలోని వివిధ ప్రాంతాలతో పౌరుల్ని భాగస్వాముల్ని చేయడంతోబాటూ, సినిమా ఎత్తి చూపిన సమస్యలపై అవగాహన పెంచడం కూడా.

ప్రత్యేకమయిన సినిమాలని చూడ్డం కోసం ప్రేక్షకుల్ని చైతన్యపరచడమంటే, కళాత్మకతతో కూడిన రసదృష్టిగల విశాలమయిన సినిమాల పట్ల వారి అభిరుచిని పెంపొందించడమే. గ్రామీణ ప్రాంతాల ప్రజలు సంబంధిత డాక్యుమెంటరీ చిత్రం ప్రత్యక్షంగా వారి సమస్యల్ని ప్రస్తావించే ప్రయత్నం చేస్తే తప్ప లేదంటే ఉద్యమాల్లో ఉండేవారైనప్పటికీ అంతగా ఆసక్తిని కనబర్చరు. ఇలాంటప్పుడే నార్మన్ మెక్‌లెరన్ సినిమాలు ఉపయోగపడతాయి. ఎలాంటి ప్రేక్షకులకయినా సులువుగా అర్థమయ్యే ఈ సినిమాలు ప్రదర్శించడం వల్ల నిర్వాహకులకి భాషతో ఇబ్బంది ఉండదు. పైగా, ప్రేక్షకులకి సినిమా భాషని పరిచయం చేయొచ్చు కూడా.

అలాంటప్పుడు మేం ఏం చేస్తామంటే, సౌండ్ లేకుండా చిత్రాన్ని ప్రదర్శించి ప్రేక్షకులకి నచ్చిందా అని అడుగుతాం. తర్వాత వీడియో లేకుండా సౌండ్ మాత్రం వేసి అదే ప్రశ్న వేస్తాం. దృశ్యశ్రవణ మాధ్యమాల కలయిక వల్లనే సినిమా సాధ్యమనే భావన దిశగా ప్రేక్షకులని తీసికెళ్తాం. ఆ దిశగా చర్చ జరిగేలా చూస్తాం. అప్పుడు సినిమాకి సంబంధించిన ఇతరేతర అంశాల్ని కూడా ప్రేక్షకులు చర్చించడానికి ఆసక్తి చూపుతారు. ఉదాహరణకి ఇందాక ప్రస్తావించిన షిట్ చిత్రంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఒక లాంగ్‌షాట్ గురించిన చర్చ చేస్తారు. ఈ చర్చలన్నీ విడివిడిగా చేసేవి కావు. సమిష్టిగానే సినిమా సారాంశాన్ని గ్రహించి సంవాదం చేయడం సాధ్యం.

నార్మన్ మెక్లరెన్ చిత్రం నైబర్స్ (1963) ఇందుకో గొప్ప ఉదాహరణ. నేను వ్యక్తిగతంగా ఈ సినిమాని 150కి పైగా వివిధ ప్రాంతాల్లో ప్రదర్శించాను. ఈ చిన్ని చిత్రం గురించి గంటకి పైగా చర్చలు జరిగేవి. పైకి ఈ చిత్రం ప్రేమ, స్నేహం

మైత్రి భావనల్ని చెబుతున్నట్టే ఉంటుంది, కానీ మనం అన్వయించుకునే విధానాన్ని బట్టి అనేక రూపాల్లో కనబడుతుంది. జండర్, జాతీయత, వనరులు వంటి అనేక అంశాలతో ఔత్సాహికులు ఈ చిత్రాన్ని ముడిపెట్టి చర్చించవచ్చు. ఇంకా నిర్వాహకులు ప్రేక్షకుల్ని సినిమాలోని ఫలానా దృశ్యం చూసి ఎందుకంతగా పడిపడి నవ్వారో అడగవచ్చు.

ఉదాహరణకి పట్టణ ప్రాంత యువకులు సినిమాల్లో స్త్రీలని కొట్టే దృశ్యాలు చూసి చాలాసార్లు ఆనందిస్తూ నవ్వుతారు. అలాంటి సందర్భాల్లో టీవీల ప్రభావం వాళ్ళపై ఎలా పడిందో మనం చర్చ లేవనెత్తొచ్చు. గ్రామీణ ప్రాంతాలవారు పై చిత్రాన్ని భూతగాదాల నేపథ్యంతో చూస్తారు. నైబర్స్ అనే బుల్లి సినిమా చారిత్రక నేపథ్యాన్ని పరిశీలించి చర్చను మరింత ముందుకు తీసికెళ్ళొచ్చు కూడా. ఆసక్తికర విషయమేమిటంటే వియత్నాం యుద్ధ సమయంలో వచ్చిన ఈ చిత్రాన్ని అమెరికా ప్రభుత్వం నిషేధించింది. చెప్పకనే అనేక విషయాలు చెప్పే సినిమాలు, వాటిని గురించిన కథలూ ప్రేక్షకులకి ఎప్పటికీ ఆసక్తికర విషయాలే.

సినిమా ప్రదర్శననేది దానికదే రాజకీయ కార్యక్రమం, దానిని అలా అర్థం చేసుకుని చూడటమే అవసరం. అందుకే సినిమానంతర సంవాదాల్లో భిన్నమయిన అభిప్రాయాలకి చోటు కల్పించడం, విభిన్న కోణాల్లో భావాల్ని ఆహ్వానించడం ఆరోగ్యకరం. సినిమా అనేది శక్తివంతమయిన మాధ్యమం అనే విషయాన్ని ప్రేక్షకులకి తెలియజేయాలి. సినిమా ద్వారా ఆలోచనలకి పదునుపెట్టి అప్పటికే ఏర్పర్చుకున్న అభిప్రాయాల తప్పొప్పుల్ని చర్చకు పెట్టడం సంభవమేనని గ్రహింపచేయాలి. అలాంటప్పుడే సమిష్టి ప్రదర్శనలు, సామూహిక సంవాదాలు సరైన దిశగా ఫలప్రదమవుతాయి.

(చల్తే తస్వీరే చిత్రోత్సవం 2018లో జరిగిన కార్యశాల నుండి తీసుకోబడింది.)

***

3. సామూహిక చలన చిత్రోత్సవాలకి సన్నాహాలు

– అమూదన్ ఆర్.పి.

చలనచిత్రోత్సవాలు లేదా ప్రదర్శనలు ఏర్పాటు చేసేప్పుడు కొన్ని ముఖ్యమైన విషయాలు గుర్తుంచుకోదగ్గవి ఉన్నాయి. ప్రదర్శన కోసం ముందుగా మనం ఎలాంటి సన్నాహకాలు చేస్తామనేదానిపైనే ప్రదర్శనా ఫలితం ఆధారపడి ఉంటుంది. సినిమా ఎంపికతో మొదలై ప్రచారం, సాంకేతిక సాధనాల్ని సంసిద్ధం చేసుకోవడం ఇవన్నీ ముందుగానే చేసుకోవాలి. ఇక్కడ నేను అలాంటి కొన్ని ప్రధానమయిన కీలక విషయాల్ని ప్రస్తావిస్తున్నాను.

చిత్రోత్సవం వెనక ఉద్దేశం :

ఎలాంటి సినిమాలని ఎంపిక చేసుకుంటామనే దానిపైనే మన ఉద్దేశం వెల్లడౌతుంది. చిత్రోత్సవ 'సారాన్ని' అదే వెనకుండి నిర్ణయిస్తుంది. చిత్రోత్సవ ఉద్దేశం విషయానికొస్తే అసలీ ఫిల్మ్ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేయడంలో గల మౌలిక ఉద్దేశం ఏంటో నిర్వాహకులకి స్పష్టత ఉండాలి. ఆ స్పష్టతే కార్యక్రమానికి భావజాల స్రవంతిని ఇస్తుంది. ఒక్కసారి కనుక కార్యక్రమలక్ష్యానికి సంబంధించీ మనకొక స్పష్టమయిన అభిప్రాయం ఏర్పడితే, ఏ విధమయిన సినిమాలు ఏ క్రమంలో ప్రదర్శించాలో తేలుతుంది.

ఒక సినిమా ప్రదర్శన వెనుక అసంఖ్యాక ఉద్దేశాలుండొచ్చు, అలాగే అనేక లక్ష్యాలు ఏర్పర్చుకోవచ్చు. కానీ ప్రదర్శనానంతరం మంచి చర్చను నిర్వహించగలిగినప్పుడే ఒక ఉమ్మడి వేదికనే భావన వస్తుంది. సమాజంలో సమకాలీనంగానున్న ఒక కదలికనో లేదా సామాజిక, రాజకీయ, చారిత్రక సందర్భాన్నో పురస్కరించుకుని సినిమాను ప్రదర్శించవచ్చు. ఉదాహరణకి, ఒక రాజకీయ పరమయిన వాతావరణంలో సినిమా ప్రదర్శన ద్వారా పౌరసమాజాన్ని స్పందింపచేయవచ్చు. ఫలానా నియోజకవర్గానికి చెందిన ప్రజలు ఫలానా సినిమా ప్రదర్శనలో భాగం కావచ్చు. కళాశాల, వాడ, పౌర సంఘాలు రాజకీయ పార్టీ వంటివాటితో కూడా భాగమవ్వచ్చు. ఇలాంటి అన్ని పరిస్థితుల్లోనూ ప్రేక్షకుల నాడిని అర్థం చేసుకోవడం, ప్రదర్శన జరుగుతున్న ప్రాంతాన్ని గురించి అవగాహన ఏర్పర్చుకోవడం చాలా ముఖ్యం.

ప్రేక్షకులని అర్థం చేసుకోవడం :

ప్రేక్షకుల మనోభావాల్ని సరైన రీతిలో కొలవడం ప్రదర్శనా విధానంలోని వివిధ క్లిష్టతలపై ప్రభావం చూపుతుంది. ఒక సినిమా ప్రదర్శన నిర్వహిస్తున్నామంటే ఆ ప్రాంత

ప్రేక్షకుల నాడికి సంబంధించి చూచాయిగానైనా సమాచారం ఉండాలి. ఈ అంశాలన్నింటినీ ఒక్కొక్కటిగా వరుసక్రమంలో పెట్టడం సంగతలా ఉంచితే, చిత్రోత్సవాల నిర్వాహకుడిగా నా అనుభవాలు కొన్ని మీతో పంచుకోవడం వలన ఈ అంశాలను గుర్తించడానికి పనికి వస్తుందేమో.

మన దేశంలో నెలకొని ఉన్న రాజకీయ కల్లోలాల్ని దృష్టిలో పెట్టుకుని విద్వేష రాజకీయాల్ని గురించి చిత్రోత్సవం నిర్వహిస్తే బావుంటుందని నా అభిప్రాయం. అయితే, అందులో ఇమిడి ఉన్న ప్రమాదాల గురించి కూడా నాకు తెలుసు. ప్రధాన స్రవంతి మీడియా మెజారిటీ ప్రజల్ని మోసపుచ్చడమే పనిగా ఎప్పుడైతే పెట్టుకుందో, అప్పుడిక ప్రత్యామ్నాయ సినిమా ప్రయత్నాలు కొద్దిమంది విశాల ఆలోచనాపరులకి మాత్రమే పరిమితం అవుతాయి. అత్యధిక జనసమూహాలకవి చేరవు. సామాజిక న్యాయమనే ఆదర్శం కేంద్రంగానే చిత్రోత్సవాలని నిర్వహించాలి. అప్పుడే సామాజిక కార్యకర్తలకనే కాకుండా సామాజిక న్యాయమనే కోణంలో విభిన్న ధోరణుల్ని ఆహ్వానించే వీలుంటుంది. అందువల్ల చలనచిత్రోత్సవాల లక్ష్యం నెరవేరి అధిక శాతం మంది ప్రజలకు సందేశం చేరుతుంది. సామాజిక న్యాయమనే అంశం అత్యధిక శాతం ప్రజానీకానికి అందేలా దేశంలోని వివిధ నగరాలయిన ఢిల్లీ, బెంగుళూరు, చెన్నై,.... వంటి చోట్ల ప్రదర్శనలు ఏర్పాటు చేసుకోవాలి.

ప్రేక్షకులని ఉత్తేజితుల్ని చేసేందుకు వారికి తేలికగా అర్థమయ్యే స్ఫూర్తివంత చిత్రాలను ప్రదర్శనకు ఎంచుకుంటే, వారు చర్చల్లో ఆసక్తికరంగా పాల్గొంటారు. ప్రేక్షకుల సంఖ్యనుబట్టి స్థానిక మిత్రులు, నిర్వాహక సభ్యులతో సంప్రదించి ఎలాంటి కథాంశంగల సినిమాను ఎంపిక చేయాలో నిర్ణయించుకోవడం తప్పనిసరి. ఉదాహరణకి ఒక కళాశాలలో విద్యార్థులకి, ఉపాధ్యాయులకి ఉపయుక్తమని భావించే సినిమాల్ని ప్రదర్శించడం వంటివి.

ప్రేక్షకులను ప్రేరేపించడం :

సాధారణ సినిమాలకు భిన్నంగా ప్రేక్షకులకి మంచి అనుభూతినిచ్చే సినిమాల్ని ఎంపిక చేయడమే చిత్రోత్సవంలో ప్రధానమైంది. ఈ విధమయిన భిన్నత్వమే వీక్షకులకి

నూతన అనుభవాన్నిస్తుంది. అలా ప్రేక్షకుల్ని ప్రేరేపించే మార్గాలకి సంబంధించీ ఒక ఉదాహరణ :

ఈమధ్య మేము పారిశుద్ధ్య కార్మికుల జీవితాలకి సంబంధించీ దివ్యభారతి తీసిన కక్కూస్ (2017) అనే తమిళ డాక్యుమెంటరీని ప్రదర్శించాలనుకున్నాం. చాలామంది స్పందిస్తూ పారిశుద్ధ్య కార్మికులకే ఆ సినిమా చూపించమని సలహా ఇచ్చారు. ఆ పాకీ కార్మికుల పనివల్ల సౌకర్యవంతంగా బతుకుతున్న వారెవరూ ఆ సినిమా ప్రదర్శన నిర్వహించడానికి సిద్ధంగా లేరు. సఫాయి కార్మికుల వల్ల లాభపడుతున్న వారెవరూ ఇందుకోసం ముందుకు రాలేదు. ఏదయినా ఒక సమస్యకి సంబంధించిన సినిమా ప్రదర్శన నిర్వహణలో ప్రజల్నుండి ఎదురయ్యే సమస్య ఇది.

చాలామంది డాక్యుమెంటరీ సినిమాలనే వాటిని నేర్చుకునే సాధనాలుగా చూస్తారు. కానీ వారి దృష్టిలో నేర్చుకోవడం అంటే నచ్చిన అంశాల్లో సమాచారాన్ని కుదించి కుదిరినంతమేర తెల్సుకోవడమే. ఫలానా సినిమా మా కోసం కాదనే ధోరణి ఈ మధ్య ప్రేక్షకుల్లో పెరుగుతోంది. సమర్ధవంతంగా ఎంపిక చేయబడిన సినిమా ప్రేక్షకుల 'ఆసక్తి'ని అధిగమించి వారిని అలరించి, ఆలోచింపజేస్తుంది. 'ఆసక్తి'కి భిన్నంగా కొత్త కోణాన్ని పరిచయం చేస్తుంది. కక్కూర్ సినిమాని మేం ప్రదర్శిస్తున్నప్పుడు కొద్దిమంది ఇలానే పునరాలోచించుకోడానికి ఆ ప్రయత్నం తోడ్పడింది. అలాంటి ప్రదర్శన మీద ఆసక్తి లేకపోవడం అనేది వారి నిత్యజీవితంలో విస్మరణకి గురౌతున్న ప్రజలకి సంబంధించిన విషయాలు ఏవీ తెల్సుకునే ప్రయత్నం చేయని అజ్ఞానంలోంచి జనించిన ఆలోచనేనని వారు గ్రహించారు.

మాధ్యమం యొక్క సామర్థ్యాలు :

చుట్టూ వ్యాప్తిలో ఉన్న అనేక వీడియోలు, సినిమాల నడుమ అసలు మాధ్యమం యొక్క విలువని విస్మరించడం సహజం. అందుకే ప్రతీ సినిమాని తాజాదృష్టితో అంచనా వేయగలగాలి. అలాగే ప్రేక్షకులకి వివిధ కోణాల్లో సినిమాని అర్థం చేయించగలగాలి.

ఒక్కోసారి సారం ఆకట్టుకుంటే, మరో సినిమాలో ప్రక్రియ ఆకట్టుకుంటుంది. మూస పద్ధతుల్లో ఇమడని సినిమాల్ని చూసే అభిరుచిని పెంపొందించడంలోనే నిర్వాహకుల ప్రతిభ ఉంటుంది. ఒకసారి చెన్నైలో చలనచిత్రోత్సవాలకి సినిమాల్ని ఎంపిక చేస్తున్నప్పుడు

మేం టీవీ డాక్యుమెంటరీలనబడే కొత్తరకం చిత్రాల్ని ప్రదర్శనకు ఎంచుకున్నాం. అనేకమంది ఔత్సాహిక చలనచిత్ర నిర్మాణకర్తలు టీవీలో ప్రదర్శించడం కోసం 20-30 నిమిషాల డాక్యుమెంటరీలు నిర్మించారు. ప్రత్యేకమయిన ఒక నిర్దిష్ట తరహాలో ఉండే ఈ చిత్రాల్ని సినీ ఔత్సాహికులు, అభిమానుల కోసం పరిచయం చేయాలని భావించాం. అస్తిత్వంలోనున్న సంకుచిత వైఖరులకి విరుద్ధంగా 'సినిమా' యొక్క నిర్వచనాన్ని విస్తృతం చేసి చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సినిమా ప్రదర్శకునికి ఉండాల్సిన ముఖ్య లక్షణం అదే.

అలాగే సినీ ప్రదర్శకుడు ఆధునిక, సమకాలీన వీడియోల పట్లా, వాటి చాకచక్యంగా ఉపయోగించగలిగిన సందర్భాల్ని నెట్టుకురాగల సామర్థ్యాన్ని కలిగి ఉండాలి. బహిరంగ మలవిసర్జన గురించి భారతీయ చలనచిత్ర సమాఖ్య ఆధ్వర్యంలో లోక్సెన్లాల్ వాణి 1980లో తీసిన 'స్టింకింగ్ స్టోరీ' అనే సినిమా ఉంది. అప్పటి పరిస్థితుల్ని కళ్ళకు కట్టినట్లు చూపిస్తూ, ప్రభుత్వంపై తెలివిగా విమర్శను ఎక్కుపెట్టిన చిత్రమిది. అనాసక్తి అంశాల్లో ఎంతో ఆసక్తికర సినిమాల్ని అన్వేషించడమే మన పని. వెతకాలే కాని అటువంటి సినిమాలు దొరకడం సాధ్యమే. ప్రదర్శకుడికి సినిమాల ఎంపికకు సంబంధించి చురుకయిన దృష్టి ఉండాలి. సినిమా ప్రదర్శనల విషయంలో ఎటువంటి ఆంక్షలైనా పెట్టడం చాలా ప్రమాదకరం.

సినిమాల ఎంపిక, ప్రదర్శనల విషయంలో ఎన్నో సంగతులు – సవాళ్ళు ఉన్నాయి. ప్రదర్శనల్లో ప్రభుత్వ జోక్యం, ప్రేక్షకుల అసహనం, సాంకేతిక సమస్యలు మొదలైనవి. ఇవన్నీ ఒక్కొక్కటిగా అంశాలవారీగా పరిష్కరించబడాలి. ప్రదర్శకుడు, సినిమాకి ప్రేక్షకులకి మధ్య వారధి వంటివాడు. అతడి పాత్ర ప్రాముఖ్యత గలది. ఇరువైపుల వార్నీ సంతృప్తిపరచడంలోనే ప్రదర్శకుడి నిపుణత దాగుంది. ఎంపిక, ప్రదర్శనకి సన్నద్ధం వంటి పనులు సినిమాకి సంబంధించినవి మాత్రమే కాదు. అవి సాంస్కృతిక, రాజకీయ పరమయినవి. ఇంకా చెప్పాలంటే వాటికవే మంచి సినిమా తీయడమంత గంభీరమయినవి కూడా.

(అమూదన్ ఆర్.పి. ఇచ్చిన ఇంటర్వ్యూ నుండి తీసుకోబడింది)

***

4. సమిష్టి సినిమా ప్రదర్శనల నమోదు ప్రక్రియ

- ఆషా జోసెఫ్

సినీప్రేమికులందరికీ తెలిసిన 'బేటిల్‌షిప్ పోటెమ్‌కిన్' (1925) సినిమా నేను మొదటిసారి చూసినప్పుడు ఆ వోడని 'పోటెమ్‌కిన్'గా పిలుస్తారనుకోలేదు. నిజానికి సినిమా అర్థం చేసుకున్నదానికన్నా 'నేనా సినిమా చూసానోచ్' అని చెప్పుకుని బడాయికి పోయిందే ఎక్కువ. తర్వాత చాలా సం॥రాలు గడిచాక అసలు సినిమా ఏంటో అది నాకు అర్థమయింది. ఏ సినిమాతోనయినా సమ్మతించడం అనేది సహజంగా దానితో ముడిపెట్టి జరిగే సంభాషణతో సంబంధం కలిగి ఉంటుందని తెలిసింది; సంభాషణనేది వీక్షించిన దాంట్లో మధించబడి బయటపడ్డ సారం. మరోలా చెప్పాలంటే, సినిమా చూసిన తర్వాత మంచి చర్చకి వాతావరణాన్ని కల్పించుకోవడమంటే, మన అవగాహనని మరింత సుసంపన్నం చేసుకో ప్రయత్నించడమే.

సినిమాలు చూడ్డంలో నాకేం నిపుణత లేదు గానీ నేను పుట్టిపెరిగిన కేరళలో ఫిల్మ్‌క్లబ్‌లు సినిమా సొసైటీల సంస్కృతి బాగా ఉంది. కాన నేను సినిమా నిర్మాణకర్తగా, సినీ అభిమానిగా ఉపాధ్యాయవృత్తి అనుభవంతో ఇదంతా ప్రస్తావిస్తున్నాను. నిర్దిష్ట స్థలంలో కూర్చొని సమిష్టిగా సినిమా చూడటం ఒక కళ. ప్రతీ ప్రదర్శనా పద్ధతిలోనూ విభిన్న సామాజిక అంశాలుంటాయి. సినిమాని మనమెలా స్వాగతిస్తామనేది వాటిపైనే ఆధారపడి ఉంటుంది. ఒంటరిగా ఒక సినిమా చూసి అనుభూతి పొందడం, సమిష్టిగా చూసి అనేక మంది అనుభూతులు పంచుకోవడం పూర్తిగా విభిన్నం. అందరి సమక్షంలో చిత్రాన్ని చూడటం పూర్తిగా వేరే అనుభవం. ఆదివాసీ పిల్లలు ఒక సినిమా మొబైల్ ఫోన్‌లో చూడటం, అదే సినిమాను మేధాపాట్కర్ ఆధ్వర్యంలో చూడటం ఒకటి కాదు.

సినిమాలో ప్రేక్షకుల్ని స్పందింపజేసిన ఆలోచనలకి సంబంధించిన చర్చ ముందుకెళ్ళినప్పుడే చలనచిత్రోత్సవాల గురించి సరైన అంచనాతో వివరాలు నమోదు చేయడం సాధ్యమౌతుంది. వీక్షణ సంస్కృతుల్ని కనుక పరిశీలిస్తే గడిచిన కొద్ది సం॥రాలలో అవి మార్పు చెందిన తీరు ప్రేక్షకలోకంలో పెనుమార్పులే తెచ్చిందని చెప్పొచ్చు. ఇన్ని సం॥రాలలో తెరలు, వీడియోలు కూడా కుదించబడ్డాయి. ప్రేక్షకుడికి పదడుగుల దూరంలో హుందాగా నిలబడిన 70 ఎం.ఎం. తెర, ఈరోజు అరచేతి పరిమాణానికి కుదించబడి ప్రేక్షకుల చేతిలో ఇమిడిపోతోంది. సినిమాల్లోని విషయంలో కూడా చెప్పుకోదగ్గ మార్పులొచ్చాయి. సినిమాలు రెండు, మూడు నిమిషాల నిడివి పెరిగితే ఆధునిక ప్రేక్షకుడు అసహనం ప్రదర్శిస్తున్నాడు. సినిమా థియేటర్‌లో అదే పనిగా విజిళ్ళు వేసే అసంఖ్యాక ప్రేక్షకుల ఆసక్తిని సొమ్ము చేసుకోవడమెలాగో ఆర్థిక వ్యవస్థ దారులు వెదుకుతోంది. ప్రధాన స్రవంతి సినిమా మూస పద్ధతులకి కట్టుబడి జనాల జేబులకి చిల్లు పెట్టడమే లక్ష్యంగా పనిచేస్తుంది. వ్యాపార సంస్థగా సినీ పరిశ్రమ ఫిల్మ్‌మేకర్స్‌కి, ప్రేక్షకులకి అగాధాలేర్పర్చింది.

బాగా రద్దీగా ఉన్న రైలులో మొబైల్ ఫోన్‌లో సినిమా చూసే వ్యక్తి దృశ్యమాధ్యమానికి సంబంధించిన పరిమిత అనుభూతినే పొందుతున్నట్టు. వినిమయదారీ దృష్టి సినిమాల్ని తాత్కాలిక సంతోషాన్ని మాత్రమే పొందే సరుకులుగా చూస్తుంది. ఇలా చెబుతున్నామంటే దానర్థం గతంలోని ఫిల్మ్‌సొసైటీలు, క్లబ్‌లు పోరపాట్లు చేయలేదని కాదు. మన సమాజంలో పురుషాధిక్యత ఎంతగా స్థిరపడిందంటే ప్రదర్శనానంతర చర్చల్లో కూడా స్త్రీలకి సరయిన భాగస్వామ్యం ఉండదు. కాన సినిమా ప్రదర్శనల్లో సమానత్వం అమలవదు. ఎక్కువ సినిమాలు మగాళ్ళ దృష్టితో చూడబడతాయ్. కాబట్టి స్త్రీలకు స్త్రీవాద దృక్కోణంలో సినిమాల్ని అంచనా వేసేందుకు అవకాశమే ఉండదు.

ఇందుకు మిగిలున్న మార్గం ప్రేక్షకుల్ని మళ్ళీ వెలుగులోకి తీసుకురావడమే. బయ్యర్లు, కార్పొరేట్లలానో లేదా సర్వం తెల్సిన సొసైటీల నిర్వాహకులు, పురుష దృష్టి వీడని మేధావుల్లో కాదు; భిన్నత్వాన్ని ఆహ్వానించడం ద్వారా మాత్రమే. అనేకరకాల అభిరుచులకి సముచిత స్థానం కల్పించడం ద్వారా మాత్రమే. అలా చేయడానికున్న ప్రభావశీల మార్గం, సామూహిక సినిమా ప్రదర్శనల్ని నమోదు చేయడం. సమిష్టి సహకారంతో చూపే చిత్రాల్ని విరివిగా చూసేందుకు వీలు కల్పించడం. ప్రేక్షకులు ఏ రకమయిన సినిమాల్ని స్వాగతిస్తున్నారో అర్థం చేసుకోవడం. ఇది కేవలం సినిమా కథనం, ప్రక్రియలకి మట్టుకే కాదు, సాంకేతిక అంశాలకి కూడా వర్తిస్తుంది. తెరమీద కనిపించే చిత్రాలు, ఇంకా శబ్దాలు, సంగీతాల నాణ్యతని కూడా గుర్తించడం అవసరం. అప్పుడే ప్రేక్షకుల నాడిని సరిగా అంచనా వేయగలుగుతాం.

సినిమాకి సంబంధించి ప్రేక్షకుల అనుభవాల్ని పంచుకోవడమే డాక్యుమెంటేషన్ లక్ష్యం. అర్థవంతమయిన సంభాషణలు, చర్చలు ప్రజా సమూహాలకి మాధ్యమానికి సంబంధించిన మరింత ఉన్నత దృక్పథాన్ని కలిగిస్తే, సినిమా నిర్మాణకర్తలకు పరిశోధకులకు నిర్వాహకులకు ప్రేక్షకుల అభిరుచి, అభిప్రాయాల గురించిన స్పష్టతనిస్తాయి. మొత్తంగా ఈ పరిస్థితి మరింత విమర్శనాత్మక సినిమా వాతావరణానికి తోడ్పడుతుంది. వివిధ రకాలయిన ప్రేక్షక మహాశయుల్ని వారి అభిరుచులకి అనుగుణంగా చూపించే సినిమా నెపంతో ఒక్క చోటికి చేర్చడంలోనే సామూహిక సినిమా సారం ఇమిడి ఉంది. ఇలాంటప్పుడే, ఈ సందర్భాల్ని డాక్యుమెంటేషన్ సాయంతో నమోదు చేయడం ప్రధాన పాత్ర పోషిస్తుంది. అలా కానప్పుడు 'బేటిల్‌షిప్ పోటెంకిన్' సినిమాని చూడని ప్రేక్షకులతోనే మనం సరిపెట్టుకోవాలి, వారినే సినీ ప్రేమికులుగా స్వాగతించి, కొనసాగించాలి.

(ఆషా జోసెఫ్ ఇచ్చిన ఇంటర్వ్యూ నుండి)

5. చల్తీ తస్వీరేతో నా ప్రయాణం

– ఫాతిమా నజీరుద్దిన్

డాక్యుమెంటరీ ఫిలిం మేకర్‌గా ప్రజలతో మమేకమయ్యే అరుదయిన సందర్భాన్ని అన్వేషించడమంటే ఎప్పుడూ నాకు ఆసక్తే. అందులో భాగంగా దేశంలో స్వతంత్రంగా జరిగే డాక్యుమెంటరీ ప్రదర్శనలపై ప్రత్యేక అభిరుచి ఉండేది. అదో విభిన్నమయిన ప్రేక్షక పాత్ర. ఇంట్లో మీ టీవీ ముందో, కంప్యూటర్ ముందో కూర్చొని చూసేదానికి భిన్నంగా, ఒక సమూహంతో మొదట్నుంచీ చివరివరకూ ఏదయినా ఒక అంశంపైనో, సమస్య గురించో సమిష్టిగా సినిమా చూడటం పూర్తిగా వేరే అనుభూతి.

చల్తీ తస్వీరే మొదటి దశ యాత్ర మొదలయ్యే నాటికి ఫిలిం మేకర్‌గా నేనో స్థాయిలో ఉన్నాను. తమిళనాడులో కూడంకుళం న్యూక్లియర్ వ్యతిరేక పోరాటానికి సంబంధించీ న్యూక్లియర్ హెల్యూసినేషన్స్ (2016) సినిమాని అప్పుడే పూర్తిచేసాను. కొన్ని ఫిలిం ఫెస్టివల్స్‌లో ఆ సినిమా ప్రదర్శించబడింది, కానీ విస్తృతంగా దానిని జనాల్లోకి తీసికెళ్ళలేకపోయాను. ప్రయోగాత్మక సినిమాని విరివిగా ప్రదర్శించి, అర్థం చేయించడం కొద్దిగా కష్టమయిన పని. కానీ తర్వాత నేను అర్థం చేసుకుందేమిటంటే, ఆ తరహా సినిమాలని కనుక నిర్మించదలిస్తే వాటిని ఆహ్వానించే ప్రేక్షకులని కూడా పెంపొందించుకోవాలి. జాన్ అబ్రహాం నుండి సినిమా ఆఫ్ రెసిస్టెన్స్ వరకూ భారతదేశంలో సంచార సమిష్టి సినిమా సంఘాలు వాటికంటూ ప్రత్యేక ప్రేక్షకుల సమూహాన్ని సృష్టించుకున్న చరిత్రుంది. 'సినిమా ఆఫ్ రెసిస్టెన్స్' సంస్థతో నా సహచర్యం కారణంగా అభిరుచిగల ప్రేక్షకులు, సినీ అభిమానులు కూడా విరివిగా సినిమాలు తీసి, మంచి సినిమాల కోసం సుస్థిరమయిన నిర్మాణాత్మక కృషి చేస్తారని గ్రహించాను.

చల్తీ తస్వీరే యాత్ర ప్రారంభమైనప్పుడు, అందులో భాగం కావడానికి నేనూ ఉత్సాహపడ్డాను. ఈ యాత్ర రూపొందించిన విధానం నావంటి ఔత్సాహికులు వీలును బట్టీ భాగం కాగలిగే సౌలభ్యం కల్పించింది. ఢిల్లీలో ఉదయం 9 నుండి సాయంత్రం 5 దాకా చేసే నా ఉద్యోగంతో యాత్ర 45 రోజులన్నీ నేను ప్రయాణించడం కుదరదు. అయితే, యాత్ర కోసమే ప్రత్యేకంగా పెట్టిన వాట్సప్ గ్రూప్ నాకూ, నాలాంటి మరికొందరికి మా సమయానుకూలంగా యాత్రలో పాలుపంచుకునే వీలుని కల్పించింది. ఢిల్లీ గాంధీ ఆశ్రమం బాలికల వసతి గృహంలో నేను చల్తీతస్వీరే బృందం అంతట్నీ కలిసాను. మళయాళీ సమాజంలో పురుషాధిక్య ధోరణుల గురించి బీనాపాల్ తీసిన 'ది సౌండ్ ఆఫ్ సైలెన్స్' (2017) సినిమాని అక్కడ ప్రదర్శించారు. కేరళలోని అనేక హాస్టళ్ళు, కళాశాలల్లో అబ్బాయిలతో పోలిస్తే అమ్మాయిలపై చూపించే వివక్షతా ధోరణుల్ని గురించి సినిమా అనంతరం చర్చను నిర్వహించారు. కేరళ నుండి వచ్చిన ఒక స్త్రీగా అక్కడ హాస్టల్‌లో అనేకమంది మళయాళీ స్త్రీలు రేకెత్తిన పలు అంశాలు నా అస్తిత్వాన్నెక్కడో తట్టిలేపాయి.

అప్పటికే అందులో కొద్దిమంది స్త్రీలు చల్తీతస్వీరే టీంతో పలుచోట్లకి ప్రయాణించి ఉన్నారు. నాకూ, మరికొందరికి ప్రధాన బృంద సభ్యులు అస్పథీసేనన్, పాజియా తెహ్‌జీబ్, సమీర్ గార్డ్‌నర్ మొదలగువారితో కల్సి వారి 45 రోజుల యాత్రానుభవాల్లో భాగం కావడమనేది నిజంగా గొప్ప అనుభవం. పురుషులకి ఈ తరహా సామాజిక కార్యాచరణలో భాగం కావడం తేలిక. కానీ, చల్తీ తస్వీరే బృందంలో ఇద్దరు యువతులుండటం ఎంతోమంది స్త్రీలని ఆకట్టుకోవడమే కాదు, వారు సైతం యాత్రలో భాగం కావడానికి ఉపయోగపడింది. గాంధీ ఆశ్రమంలో సైతం నాతో సహా స్వచ్ఛందంగా ఎంతోమంది ఈ బృందంలో వచ్చి చేరారు.

నేను ఉత్తరప్రదేశ్‌లోని సహ్‌రన్‌పూర్‌లో సినిమా ప్రదర్శనలకోసం అక్కడికెళ్ళాను. అక్కడ రెండు ప్రధాన ప్రదర్శనలు జరిగాయి : సినిమాల ఎంపిక చాలా ఆలోచించి చేసారు. మొదటి ప్రదర్శన ఒక పాఠశాలలో జరిగింది. అక్కడ విద్యార్థులతోపాటూ అధ్యాపక సిబ్బంది కూడా ప్రేక్షకుల్లో భాగమయ్యారు. 'కొడైకెనాల్ మాకొద్దు' అనే వీడియోతో ముందుగా ప్రదర్శన ప్రారంభించారు. కొడైకనాల్‌లో హిందూస్థాన్ లివర్ ఫ్యాక్టరీపెట్టి ఆ ప్రాంతాన్నంతటినీ కలుషితం చేసింది. దానికి వ్యతిరేకంగా తీసిన వీడియో అది. విద్యార్థుల్ని అదెంతో ప్రభావితం చేసింది. వీడియో అనంతరం

కాలుష్య పరిశ్రమలూ, వాటి విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి మంచి చర్చ జరిగింది. తర్వాత అక్కడ క్లాసిక్ ఫిలిం డివిజన్ సినిమా 'ఐయాం 20' (1967), ఫజిల్ -షాన్ 'ఇన్ ద షేడ్ ఆఫ్ ఫాలెన్ చినార్' (2016) డాక్యుమెంటరీలు ప్రదర్శించారు. ఐయాం 20 చిత్రం ఇరవయ్యేళ్ళ భారద్దేశ స్వాతంత్ర్యాన్ని గురించైతే 'ఇన్ ద షేడ్ ఆఫ్ ఫాలెన్ చినార్' కాశ్మీర్ కల్లోల పరిస్థితుల గురించి కాశ్మీరీ యువత ప్రతిస్పందనకి ప్రతిరూపం. మొదటి చిత్రం నాటి నేటి దేశ స్థితిగతులపై చర్చను ప్రేరేపించింది. రెండో సినిమా కాశ్మీర్ సంక్షోభం గురించిన సంవాదాన్నీ, అంతిమంగా శాంతి కొరకు చేయాల్సిన ప్రయత్నాలపై తీర్మానిస్తూ ముగిసింది.

తర్వాత ప్రదర్శన ఖాటాఖేడీ అనే మొహల్లాలో జరిగింది. అక్కడ చివరగా ప్రదర్శించిన 'భీం ఆర్మీ' వీడియోకి స్థానిక పరిస్థితుల దృష్ట్యా మిశ్రమ స్పందనొచ్చింది. ప్రతీ వర్గం ప్రేక్షకుల స్పందన నుండి ఎంతో కొంత బృంద సభ్యులు నేర్చుకోగలిగారు. సాంప్రదాయ చలన చిత్రోత్సవాలతో పోలిస్తే ఈ అనుభవం పూర్తిగా నాకు కొత్తదనంతో కనిపించింది. ప్రేక్షకుల అభిరుచిని తృప్తిపర్చే సినిమాల ఎంపికకు నిజాయితీగా బృందం కృషి చేసేది. ప్రేక్షకుల సమూహంతో సంభాషణ తర్వాతే సినిమాల ఎంపిక అంతిమంగా జరిగేది.

ఉత్తరాఖండ్‌లోని టెహ్రీటోంగియా అనే గ్రామంలో సిక్కు బంజారా సమూహంతో మాకు కలిగిన అనుభవం ప్రేక్షకుల భావాలు పంచుకోవడం ఎంతవసరమో తెలియజేసి నాకు అవగాహన

పెంచింది. ఇక్కడ మళయాళం నుంచి హిందీలోకి అనువదించిన 'మాటికీ మాన్' (2017) అనే సినిమా ప్రదర్శించాం. కేరళ లోని అరిప్పా భూపోరాటాలకి సంబంధించిన ఆ చిత్రం చూసి అటవీ అధికారులు చెలాయిస్తోన్న జులుం, కాలరాస్తోన్న తమ భూమి హక్కులు వంటి విషయాలెన్నో టెహ్రీటోంగియా ప్రజలు చర్చించారు. అలాగే ఒక దళిత సిక్కు మహిళ 'గిన్నీ మాహి' వీడియోలు



అక్కడ కూర్చున్న హరిపూర్ టోంగియా ప్రేక్షకుల మనస్సుల్లో కులహంకార ప్రశ్నను లేవనెత్తాయి. ప్రేక్షకులు రెట్టించిన ఉత్తేజంతో చర్చలు చేసారు. ప్రదర్శన జరిగిన చోట చిన్న గురురవిదాస్ మందిరం ఉంది. కొద్దిమంది ప్రేక్షకులు ప్రదర్శన తర్వాత మా దగ్గరకి వచ్చి ఇంకా మంచి వీడియోలేమయినా ఉన్నాయా అని అడిగారు. మేం వారి మొబైల్‌ఫోన్లలోనే యూట్యూబ్ సౌకర్యాన్ని వారికి తీసి చూపించి ఎప్పుడు కావాలంటే అప్పుడు వారు వాటినెలా చూడవచ్చో వివరించాం.

హరిపూర్ టోంగియా గ్రామంలో ప్రదర్శన తర్వాత మూడోరోజు నేను ఢిల్లీ రావాల్సి ఉండడంతో, చెల్తే తస్వీరే బృందం వద్ద నేను సెలవు తీసుకున్నాను. కానీ, నేను వారితో కల్సి చేసిన ఇంతోటి చిన్న ప్రయాణమే నా కళ్ళు తెరిపించేంత అనుభవాన్ని నాకు అందించింది. ప్రేక్షకులంటే ఏదో సినిమా చూసి పోయేవాళ్ళు కాదు, మన సినిమా చూడ్డానికి ఎగబడే వాళ్ళూ కాదు. ప్రజల్ని మనం గ్రామాల్లో కల్సి, వారి గుండెచప్పుడు విని, వారి తిండి తిని వారితో కల్సి ప్రదర్శన నిర్వహించినప్పుడే నూతన తరహా వీక్షణ పద్ధతులనేవి ఆవిష్కరించబడతాయ్. విలక్షణమయిన కొత్త ప్రయోగాలకు అలాంటి ప్రజాతంత్ర భావనతో కూడిన నూతన ప్రయత్నాలే దారిని చూపుతాయి. ఉదాహరణకి టెహ్రీటోంగియా గ్రామంలో అక్కడ జరిగిన భూపోరాటాల్ని గురించి వీడియోలు తీసేందుకై చర్చలు జరిగాయి.

చలనచిత్ర కర్తగా నా ఆచరణని పునఃపరిశీలించుకునేలా చల్తే తస్వీరే నన్ను మల్చింది. నిజానికి యాత్రలో ఎక్కడా నేను నా సినిమా ప్రదర్శించలేదు. కానీ, ప్రజలతో మమేకమవడం అనేది సొంత సినిమా చూపించుకోవడం కన్నా చాలా మెరుగయిన పనని నాకనిపించింది. అందువల్ల వారికెటువంటి అభిరుచులు ఉన్నాయో తెల్సుకునే అవకాశం ఉంటుంది. ఇకమీదట సినిమా పూర్తిచేసి ప్రేక్షకుల కోసం వెతుకులాడే కంటే, విభిన్న మనస్తత్వాల ప్రజల్ని దృష్టిలో ఉంచుకుని సినిమా తీసేందుకు నేను ప్రయత్నిస్తాను.

కదలకుండా కూర్చుని ప్రధాన స్రవంతి మీడియాని తిట్టడం చాలా సులువయిన పని. కానీ, ఒక ప్రాజెక్టరు పట్టుకుని మీరు కనుక కదలడానికి సిద్ధపడితే, భిన్నమయిన సినిమాల్ని చూసి ఆదరించి, స్వాగతించేందుకు దేశవ్యాప్తంగా ఎందరో ప్రజలున్నారు. అలాంటి సినిమాల ద్వారానే కొత్త సంభాషణలు, సంవాదాలు మొదలౌతాయి. అవి కచ్చితంగా మరింత మంచి సమాజం కోసం జరిగే ప్రయత్నాలకు భరోసానిస్తాయి.

***

మా యాత్రానుభవాల నుండి; సినిమా ప్రదర్శనలో చేయాల్సినవి, చేయకూడనివి

చేయాల్సినవి (Do's) :

1. సినిమా ప్రారంభించడానికి ముందుగానే ప్రదర్శించబోతున్న సినిమా గురించి సంక్షిప్తంగా పరిచయం చేస్తూ దాని నిర్మాణకర్త తదితర కొద్దిపాటి వివరాలు చెప్పాలి.
2. టీం సభ్యులు అందరికీ ప్రదర్శనలో వారివారి విధులు అప్పజెప్పాలి; ప్రాజెక్టరు సెట్ చేస్కోవడం, తెర అమర్చడం, ప్రేక్షకుల ప్రవేశం చూస్కోవడం, సౌండ్ పరీక్షించడం, ప్రచారం చేయడం, నమోదు చేయడం వంటి పనులన్నీ ఎవరి విధులు వాళ్ళు నిర్వర్తించేలా చూస్కోవాలి.
3. పట్టుకెళ్ళిన పరికరాల జాబితా గుండు సూదితో సహా వైర్లూ, కేబుళ్ళూ వంటివన్ని ఉండాలి. ప్రతీ ప్రదర్శన జరిగే ముందూ, జరిగిన తర్వాత ఆ జాబితాలోని సామాన్లను సరిచూసుకోవాలి.
4. సినిమాలకి సంబంధించిన నకలు పెన్‌డ్రైవ్‌లో లేదా హార్డ్ డిస్క్ ఒకటుండాలి. అలా రెండింటిలో ఉండటం మంచిది. అలాగే ప్రదర్శనప్పుడు అంతరాయం కలగకుండా వేయాలనుకుని ఎంపిక చేసిన సినిమాల్ని ముందుగానే లాప్‌టాప్‌లో కాపీచేసి ఉంచుకోవాలి.
5. లాప్‌టాప్‌లో సినిమాల్ని లేదా సినిమాలున్న ఫోల్డర్‌ని ఒక వరుసక్రమంలో పెట్టుకోవడం ముఖ్యం. అది అక్షరమాల వరుసలోనా మరో తరహాలోనా అనేది చూసుకుని, ప్రతీ సినిమా పేరు, నిడివి అర్థమయ్యేలా రాసిపెట్టుకుంటే మంచిది. లాప్‌టాప్‌ను చూసే వ్యక్తికి ఆ వివరాలన్నీ గుర్తుంటే ఇబ్బంది ఉండదు.
6. ప్రదర్శనకి ముందే లాప్‌టాప్ ఛార్జింగ్‌లో పెట్టుకోవాలి. చాలాచోట్ల ప్లగ్‌పాయింట్స్ ఉండకపోవచ్చు. ముందు జాగ్రత్తగా వో రెండు ఎక్స్‌టెన్షన్ బోర్డుల్ని పెట్టుకుంటే మంచిది.
7. ఎక్స్‌టెన్షన్ బోర్డులకి 5 లేదా అంతకన్నా ఎక్కువ పాకెట్లతో పాటూ కనీసం 30 నుండి 40 అడుగుల వైరుండేలా చూడాలి.
8. ప్రేక్షకులని వారి మొబైల్ ఫోన్లు స్విచ్ఛాఫ్ చేయమనీ లేదా సైలెంట్‌లో పెట్టమని కోరాలి. సినిమా ప్రదర్శన మధ్యలో సెల్‌ఫోన్లు మోగితే ఎంత విసుగ్గా ఉంటుందో తెలియజేయాలి.

9. ఇప్పటికైతే వివిఎల్‌సి ప్లేయర్ అన్నింట్లోకీ ప్రభావితమయిన మల్టీమీడియా ప్రోగ్రాం. అదే డౌన్‌లోడ్ చేసుకోవడం ఉత్తమం.

10. ఒకవేళ సినిమా ప్రత్యక్ష అనువాదం చేయాల్సి వస్తే ఆ అనువాద రాతప్రతిని దగ్గరుంచుకోవాలి. ప్రదర్శనకి ముందే ఒక రిహార్సల్ చదవాలి.

11. దృశ్యం, శబ్దం రెండింటినీ సరిచూసుకుని ఆ స్థలంలోని చివరి పంక్తి వరకూ ప్రసారమౌతున్నాయని నిర్ధారించుకోవాలి.

12. ప్రేక్షకులు చాలామంది సినిమాలు కావాలని అడగొచ్చు. వాటిని అందజేసే ఆలోచన ఉందని చెప్పాలి; ఒకరిద్దరికిచ్చి పంచుకోమనటమో లేదా ఆన్‌లైన్‌లో షేర్ చేయడమో చేయాలి.

13. ఎప్పుడూ కూడా చర్చకి సమయం ఉండేటట్లే ప్రదర్శనని పెట్టుకోవాలి. చర్చను ఎలా ప్రారంభించాలో, స్థానికంగా సహకరించేవారితో ముందుగా మాట్లాడాలి. ఉదాహరణకి కొన్ని ప్రశ్నలు రేకెత్తించడం లేదా సినిమా నిర్మాణకర్త కనుక ఉంటే ప్రేక్షకుల్ని వారి సందేహాలు అడగమనడం ఇలా చర్చకోసం ప్రణాళిక ముందుగా వేసుకోవడం వంటివి.

14. ప్రదర్శన జరిగే హాలు లేదా గది వీలైనంత చీకటిగా ఉండేలా చూసుకోవాలి. ముందుగానే వెలుతురు తెరమీద పడకుండా లోపలిలైట్లు పరిశీలించాలి. అవసరమైతే వో నాలుగు నల్లగుడ్డముక్కలు ముందు జాగ్రత్తగా బ్యాగ్‌లో ఉంచుకోవాలి. ముఖ్యంగా తలుపు ఎటువైపుందో చూసుకోవాలి. అది తెరిచినప్పుడల్లా తెరపై కాంతి పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

15. ఏదేని సినిమాను ప్రదర్శించేటప్పుడు లేదా చలనచిత్రోత్సవంలో ప్రదర్శించాలనుకున్నప్పుడు వీలయితే ఆ సినిమా నిర్మాణకర్త అనుమతి తీసుకోవడం మంచి పద్ధతి.

16. టోపీ లేదా రుమాలుతో ప్రదర్శనానంతరం ప్రజల వద్ద నుండి విరాళాలు అడగవచ్చు. సమిష్టితత్వాన్నిపెంపొందించడం కోసమే ఈ సామూహిక సినిమా ప్రదర్శనలు ఏర్పాటు చేయడం జరుగుతోందనీ, ఇందుకోసం ప్రజలు స్వచ్ఛందంగా వారివంతు సహకరించడం ముఖ్యమని అర్థించడం అవసరం.

17. ఈ కార్యక్రమాన్నంతటినీ ఫోటోలు తీసేందుకూ, లిఖితరూపంలో నమోదు చేసేందుకు కచ్చితంగా కార్యకర్తలు ఉండాలి. తర్వాత ప్రచారానికి అవి ఉపయోగపడతాయి. అంతేకాక ప్రదర్శన తర్వాత జరిగే చర్చల్లో కూడా ఇలా నోట్ చేసుకునే విషయాలు, గమనించిన సంగతుల అవసరం ఉండవచ్చు.

18. ప్రేక్షకులకి కృతజ్ఞతలు చెబుతూ ప్రదర్శనలో పాల్గొన్నవారి ఉత్సాహాన్ని అభినందించడం మర్చిపోకూడదు.

19. ఒక తెల్లచార్ట్, స్కెచ్‌పెన్ను ఉంచి ప్రదర్శనానంతరం గానీ విరామంలో కానీ ప్రేక్షకుల అభిప్రాయాలు దానిపై రాయమని కోరవచ్చు. అంతమంది మధ్యలో మాట్లాడ్డానికి వెనుకాడేవారు ఆ విధంగా స్వేచ్ఛగా భావాలు వెలిబుచ్చవచ్చు.

20. ఒకవేళ సినిమా ప్రదర్శనలో ఉపయోగించిన పరికరాలు కనుక అద్దెకి తెచ్చినవైతే వాటిని తిరిగి సరయిన కాలంలో జాగ్రత్తగా అప్పజెప్పాలి.

చేయకూడనివి (Dont's) :

1. ప్రొజెక్టరు తదితర పరికరాలపై పిల్లలకి సరదా ఉంటుంది. వాళ్ళు వాటన్నింటిని పీకిపాకం పట్టకుండా జాగ్రత్తగా చూసుకోవాలి. వాళ్ళకి పోస్టర్లు వేయటం, గదిని సర్దడం వంటి పనులు అప్పగించవచ్చు.

2. పరికరాల్ని ఎలాపడితే అలా వొదిలేయకూడదు, కనీసం సామాన్ల వద్ద ఒక్క వ్యక్తయినా కాపలా ఉండాలి.

3. ప్లగ్ పాయింట్‌కి సరాసరి ప్రొజెక్టరును కనెక్ట్ చేయరాదు. విద్యుత్ హెచ్చుతగ్గులు ప్రమాదం నుండి తప్పించుకోడానికి యుపియస్ ఉపయోగించాలి.

4. సరిగ్గా ప్రదర్శన సమయానికే వేదిక వద్దకు ఎప్పుడూ వెళ్ళరాదు. కనీసం కొన్ని గంటల ముందుగా అక్కడకి వెళ్ళి సభాస్థలి, సౌండ్ తదితర అంశాలు పరీక్షించుకోవాలి.

5. ప్రదర్శనానంతరం ప్రేక్షకుల్ని ప్రోత్సహించి స్నేహపూరితంగా వారి భావాలు పంచుకోగలిగేలా వాతావరణాన్ని ఏర్పర్చాలే కానీ మాట్లాడమని పదే పదే వార్ని బలవంతపెట్టరాదు.

6. నిర్దిష్టమయిన సినిమా గురించి ప్రేక్షకులతో వాదోపవాదాలు చేయరాదు. దానికంటే చర్చను ప్రోత్సహిస్తూ మన దృష్టికోణాన్ని ప్రవేశపెట్టడం మేలు. ప్రేక్షకుల ప్రాతినిధ్యాన్ని గుర్తుపెట్టుకుని వక్కాణించడం చేయాలి.

7. తక్కువ నాణ్యతగల సినిమాలని ప్రదర్శించరాదు. సినీ నిర్మాణకర్తలు మంచి నాణ్యతగల చిత్రాల్ని ప్రదర్శనకు ఇస్తారు.

8. ముందుగా చూడకుండా అసలే సినిమాని ఎప్పుడూ ప్రదర్శించకూడదు.

9. ఒకరి అనుమతి లేకుండా, పూర్తి అవగాహన లేకుండా మరొకరి పరికరాల్ని ఉపయోగించకూడదు.

10. ప్రొజెక్టరు, స్పీకర్ల దగ్గర పరిగెత్తడం, కోట్లాడటం వంటి వాటిని చేయనివ్వకూడదు.

11. సినిమా ప్రదర్శించనప్పుడు ప్రొజెక్టరు ఆన్ చేసి వదలకూడదు. ప్రొజెక్టరు జీవితకాలం అందులోని బల్బుమీద ఆధారపడి ఉంటుంది. కాబట్టి జాగ్రత్తగా ఆచితూచి వాడాలి.

12. నిర్ణీత స్థలం యజమాని అనుమతి లేకుండా ప్రదర్శన చేయరాదు. వీలైతే రాతపూర్వక అనుమతి పొందడం మంచిది.

13. ప్రదర్శన జరిగే స్థలంలో అనుమతి లేకుండా పోస్టర్లు అంటించకూడదు.

14. మన లక్ష్యాలు, అనుభవాలకి సంబంధించి వచ్చే ప్రశ్నల్ని నిరుత్సాహపరచకూడదు.

15. ప్రేక్షకుల మధ్య వాదోపవాదాలకు చోటివ్వరాదు. చర్చ పక్కదారి పట్టి తీవ్రంగా మారుతున్నప్పుడు వెంటనే కల్పించుకుని అడ్డుకట్ట వెయ్యాలి లేదా స్థానిక నిర్వాహకుల సాయం అడగాలి.

16. సినిమా ప్రదర్శన జరుగుతున్నప్పుడు పరిసరాల్ని వదిలిపెట్టి వెళ్ళకూడదు. ఏదయినా సాంకేతిక సమస్య తలెత్తినా లేదా ప్రేక్షకులేమైనా ప్రశ్నలు వేసినా అందుబాటులో ఉండాలి.

17. అకస్మాత్తుగా పడే అకాల వర్షాన్నీ, వీధికుక్కల బెడదనీ, ఊరి పశువుల్నీ, అల్లరి పిల్లల్ని గురించి సన్నద్ధమవకుండా బహిరంగ ప్రదేశాల్లో ప్రదర్శనలు చేయకూడదు.

18. ప్రదర్శనా సమయంలో ప్రేక్షకుల్నిఫోన్‌లో మాట్లాడనివ్వకూడదు. అనివార్యమయిన ఫోన్ సంభాషణయితే వార్ని బయటకెళ్ళి మాట్లాడమని అభ్యర్థించాలి.

19. సినిమా ముగిసాక వచ్చే పేర్లను ఎన్నడూ ఆపకూడదు. ఆ సినిమాకోసం పనిచేసిన చిట్టచివరి వ్యక్తి పేరు వరకూ పూర్తిగా సినిమా ప్రదర్శించడం ప్రధానం.

20. జనరేటర్‌ని ప్రదర్శనకి దగ్గరలో అమర్చనివ్వరాదు, సినిమా అనుభవాన్ని ఆ గరగర ధ్వని ఆటంకపరుస్తుంది.

***

తెల్సుకోవాల్సిన విషయాలు

1. లాప్‌టాప్‌ని ప్రాజెక్టరుతో కలిపే రెండురకాల కేబుళ్ళున్నాయి.

   హెచ్.డి.ఎమ్.ఎ. : ఈ మధ్య ఆధునికంగా వచ్చే లాప్‌టాప్‌లన్నింటికీ ఈ కేబుల్ ఉంటోంది. ఈ కేబుల్ వీడియో, ఆడియోలు రెండింటినీ పంపగలదు. ప్రదర్శన సమయంలో లాప్‌టాప్ నుండి ప్రాజెక్టర్లోంచి కాకుండా స్పీకర్ల నుండి సౌండ్ వచ్చేలా సెట్టింగ్స్ మార్చుకోవాల్సి ఉంటుంది.

   విజిఎ : పాత లాప్‌టాప్‌లకి ఈ కేబుల్ ఉంటుంది. మందపాటి స్క్రూలూ, ప్లగ్‌లతో ఉంటుందిది. ఇది వీడియోని మాత్రమే ట్రాన్స్‌ఫర్ చేస్తుంది. లాప్‌టాప్‌కి ఏ కేబుల్స్ పడతాయో చూసుకోవాలి; దాదాపు ప్రాజెక్టర్లన్నింటికీ రెండు రకాల కేబుళ్ళను అనుసంధించడానికి కావాల్సిన ఇన్‌పుట్లుంటాయ్.

2. ప్రాజెక్టరు అమర్చిన తర్వాత తెర సరిగ్గా అమర్చకపోతే సమస్య, అత్యుత్తమ చిత్ర నాణ్యత కొరకు ప్రాజెక్టరు సెట్టింగ్స్‌లో ఎంత కాంతి కావాలో ఆ పరిమాణాన్ని సరిచూసుకోవాలి.

3. భూమికి తెర 90 డిగ్రీలు లంబంగా ఉంటే మంచిది. అలా కానప్పుడు చిత్రం విషమ చతుర్భుజాకారంలో వస్తుంది. అయితే ప్రాజెక్టర్లలో ఉన్న కీస్టోన్ ఫీచర్‌ని ఉపయోగించి దీన్ని సరిచెయ్యొచ్చు. చిత్రాన్ని నిలువుగానయినా, అడ్డంగానయినా సరిచేసుకోవచ్చు.

4. స్పీకర్ల వాల్యూం ఎప్పుడూ పూర్తిగా పెట్టరాదు. వాల్యూంలో మార్పులు లాప్‌టాప్‌లో సరిచేసుకోవచ్చు. విఎల్‌సి ఉపయోగిస్తున్నట్లయితే వాల్యూంని ఆకుపచ్చ రంగు దాటనివ్వరాదు. ఎంపిక చేసుకున్న ప్రదర్శనాస్థలంలో ఎంత సౌండ్ కావాలో ముందుగానే పరీక్షించుకుంటే మంచిది. తెర ఎటువైపునుందో ఆడియో సిస్టం కూడా దానికి అమరేలా ఉన్నప్పుడే చిత్రం ధ్వని బాగుంటుంది.

(పిడి వాల్సన్ సహకారంతో రూపొందించినది)

చల్తీ తస్వీరే బృందం

విభిన్న శ్రేణులకి చెందిన సామాజిక కార్యకర్తలు, స్వచ్ఛంద సేవకులు, సినీ ప్రేమికుల సహకారంతోనే గతేడు చల్తీ తస్వీరే సంచార చలన చిత్రోత్సవాలు నిర్వహించగలిగింది. సినిమా ఎంపిక, ప్రచారం, పర్యవేక్షణ, సంప్రదింపులు, బట్వాడా, సౌకర్యాలు, సంవాదాలు.. ఇలా అన్నింటిలోనూ ఈ కింది మిత్రసంస్థల ప్రమేయముంది.

- ఆదివాసీ వికాస్ మంచ్, రాజస్థాన్
- ఆలిండియా డెమోక్రటిక్ విమెన్స్ ఆర్గనైజేషన్, హిమాచల్ ప్రదేశ్

- ఆలిండియా కిసాన్ సభ
- ఆలిండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్
- ఆలిండియా యూనియన్ ఆఫ్ ఫారెస్ట్ వర్కింగ్ పీపుల్, ఉత్తరప్రదేశ్ & ఉత్తరాఖండ్
- అవధ్ పీపుల్స్ ఫోరం, ఉత్తరప్రదేశ్.
- భారత్ జ్ఞాన్ విజ్ఞాన్ సమితి, హిమాచల్ ప్రదేశ్ & న్యూఢిల్లీ
- భూదాన్ థియేటర్ సొసైటీ, గుజరాత్
- సినిమా ఆఫ్ రెసిస్టెన్స్, ఉత్తరప్రదేశ్ & న్యూఢిల్లీ
- ఢిల్లీ ఫోరం
- ఢిల్లీ సాలిడారిటీ గ్రూప్
- ఢిల్లీ యంగ్ ఆర్టిస్ట్స్ ఫోరం
- డైనమిక్ యాక్షన్, కేరళ
- ఏక్‌తారా కలెక్టివ్, మధ్యప్రదేశ్
- గుహార్, న్యూఢిల్లీ
- హరేలా సొసైటీ, ఉత్తరాఖండ్
- హిమాచల్ జ్ఞాన్ విజ్ఞాన్ సమితి
- ఇన్సానీ బిరాదరి
- జాగోరి, హిమాచల్ ప్రదేశ్
- జన్ దస్తక్ సాంస్కృతిక్ మంచ్, ఉత్తరప్రదేశ్
- మచ్చిమార్ అధికార సంఘర్ష్ సంఘటన్, గుజరాత్
- మతూ జన్ సంఘటన్, ఉత్తరాఖండ్
- మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్, రాజస్థాన్
- మైనారిటీ కోర్డినేషన్ కమిటీ, గుజరాత్
- ముస్కాన్, మధ్యప్రదేశ్
- నర్మదా బచావో ఆందోళన్, మధ్యప్రదేశ్ & మహారాష్ట్ర
- నర్మదా నవనిర్మాణ్ అభియాన్, మహారాష్ట్ర
- నేషనల్ అలియన్స్ ఆఫ్ డీనోటిఫైడ్ ట్రైబ్స్, రాజస్తాన్ & న్యూడిల్లీ
- నేషనల్ అలియన్స్ ఆఫ్ పీపుల్స్ మూమెంట్స్, న్యూఢిల్లీ
- నేషనల్ డొమెస్టిక్ వర్కర్స్ యూనియన్, న్యూఢిల్లీ
- నేషనల్ ఫిష్‌వర్కర్స్ ఫోరం
- నేషనల్ ఫౌండేషన్ ఫర్ సోషల్ డెవలప్‌మెంట్, రాజస్థాన్
- న్యూ ట్రేడ్ యూనియన్ ఇనీషియేటివ్
- పాకిస్తాన్ ఇండియా పీపుల్స్ ఫోరం ఫర్ పీస్ అండ్ డెమోక్రసి (ఇండియా చాప్టర్)
- పార్టర్స్ ఇన్ జస్టిస్ కన్‌సర్న్స్ ఇండియా
- పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్
- పింజిరాటోడ్, న్యూఢిల్లీ
- ప్రోగ్రెసివ్ సినిఫైల్స్ (పంజాబ్ యూనివర్శిటీ), చండీఘర్

- రాజస్థాన్ మహిళా కామ్‌గార్ యూనియన్
- రాజస్థాన్ అసంఘటిత్ మజుదూర్ యూనియన్
- సమస్త బారూచ్ జిల్లా మచ్చిమార్ సమాజ్, గుజరాత్
- సంభావన, హిమాచల్ ప్రదేశ్
- స్కూల్ ఫర్ డెమోక్రసీ, రాజస్థాన్
- స్త్రీ ముక్తి సంఘటన్, ఉత్తరప్రదేశ్
- ఉదయ్‌పూర్ ఫిలిం సొసైటీ, రాజస్థాన్
- విజ్ఞాన్ ఫౌండేషన్, ఉత్తరప్రదేశ్

సలహా మండలి

● ఆంచల్ కపూర్ ● అమూదన్ ఆర్.పి. ● ఆషా ఆచి జోసెఫ్
● కిస్లే గొంజల్‌వెజ్ ● నకుల్‌సింగ్ సహాని ● రాహుల్ రాయ్ ● రంజన్ డి.
● సంజయ్ జోషి ● సంజయ్ కాక్ ● సతీష్ పోదువల్ ● తరిణి.

భాగస్వామ్య సంఘాలు

చల్‌చిత్ర్ అభియాన్

ఇదో ఫిల్మ్–మీడియా కోపరేటివ్ సంస్థ. ఆడియో – వీడియో మాధ్యమాల్లో స్థానిక యువతకి శిక్షణ నిస్తుంది. ప్రత్యామ్నాయ సంస్కృతే ప్రధాన సంస్కృతని భావిస్తూ దాని నిర్మాణంలో పనిచేస్తుంది.

సినిమా ఆఫ్ రెసిస్టెన్స్

2006లో గోరఖ్‌పూర్‌లో క్షేత్రస్థాయిలో ఆరంభించబడ్డ సమిష్టి సాంస్కృతిక వేదిక. గ్రామాలు మొదలుకుని నగరాల వరకూ, దేశవ్యాప్తంగా పాఠశాలల నుండి విశ్వవిద్యాలయాల దాకా ప్రతీచోట ప్రదర్శనలు నిర్వహిస్తున్న సంస్థ. ఒక సాంస్కృతికోద్యమంగా అణగారిన ప్రజల గురించిన స్పృహను కలిగి ఉండడంతోపాటూ, భారతీయ భాషలు మొదలుకొని ప్రపంచంలోని మంచి సినిమాలన్నింటినీ ప్రజలందరికి చేర్చడం, సినిమా కార్యకర్తల్ని రూపొందించడం చేస్తోన్న సంఘమిది. 2013లో బెంగాల్‌లో ఏర్పడిన **పీపుల్స్ ఫిల్మ్ కలెక్టివ్** దీన్నుండి స్ఫూర్తి పొందినదే.

కృతి ఫిల్మ్ క్లబ్

కృతి అభివృద్ధి, మానవ హక్కుల గురించి పనిచేస్తూ స్వతంత్రంగా డాక్యుమెంటరీల్ని చూడ్డం, పంచుకోవడం చేస్తున్న సంఘం, ప్రజా ఉద్యమాలు, సమాజంలోని సమస్యల గురించి సినిమాల్ని ప్రదర్శిస్తుంటుంది.

మ్యాజిక్ లాన్‌తర్న్ మూవీస్

మ్యాజిక్ లాన్‌తర్న్ మూవీస్ (ఎమ్.ఎల్.ఎమ్) సాంస్కృతిక నిర్మాణరంగం, వైజ్ఞానిక రంగాల్లో పనిచేస్తుంది. డాక్యుమెంటరీల ద్వారా వ్యవస్థలోని వివిధ దశల్లో ప్రజాలోచనకి చోటు కల్పించే లక్ష్యంతో దార్శనిక వేదికల్ని నిర్మిస్తుంది. సినిమా గురించి లోతుగా పరిశోధించడంతోబాటూ సాంప్రదాయ మార్కెట్ విస్తరించనిచోట ప్రత్యామ్నాయచిత్రాల్ని సమర్దిస్తూ మామూలుగా లభ్యంకాని అనేక డాక్యుమెంటరీల్ని పరిరక్షిస్తూ, సినిమాల ఎంపిక, నిర్మాణం, ప్రదర్శన, పంపిణీ, శిక్షణ వంటి రంగాల్లో కృషి చేస్తుంది.

మరుప్పాకమ్

1997లో అమూదన్ ఆర్.పి. ప్రారంభించిన ఈ సంఘం సామాజిక సమస్యలపై పనిచేసే మీడియా కార్యకర్తల వేదిక. 1998లో మొదలయిన మధురై ఇంటర్నేషనల్ డాక్యుమెంటరీ అండ్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌తో సహకారం కలిగి ఉంది. ఈ సంఘం కార్పొరేట్ నిధులు, విరాళాలు స్వీకరించకుండా చిత్రోత్సవాలకు ఉచిత ప్రవేశం కల్పిస్తూ కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో కార్యక్రమాలు చేస్తోంది. సినిమా ప్రదర్శనలతో బాటుగా మరుప్పాకమ్ ఆసక్తి గల వారికి సినిమాలు నిర్మించడంలో కూడా శిక్షణ ఇస్తుంది.

మీడియా కలెక్టివ్

మీడియా కలెక్టివ్ కొద్దిమంది వ్యక్తులు, కొన్ని సంఘాలతో ప్రజా పోరాటాలు, రాజకీయాలపై భిన్నత్వంతో కూడిన సంవాదాలు, సృజనాత్మక మాధ్యమాల గురించి చర్చించే ప్రయోగాత్మక ఐక్యవేదిక. ప్రధాన స్రవంతికి భిన్నంగా ప్రత్యామ్నాయ సాంస్కృతిక రంగంలోనూ, మీడియా మాధ్యమాల్లోనూ కృషి చేసేవారికి సృజనాత్మక సహకారం అందించే సమాఖ్య.

విబ్‌గ్యోర్ (VIBGYOR) ఫిలిం కలెక్టివ్

విబ్‌గ్యోర్ 2006లో వివిధ నెట్‌వర్క్‌లు, దళిత, యువజన పర్యావరణ, హక్కుల సంఘాలతో ఏర్పడిన సమాఖ్య. జాతీయ, దక్షిణాసియా స్థాయిలో సంస్కృతి, స్త్రీ సంఘాలు, ప్రపంచీకరణ, కార్మిక సంఘాలతో భాగస్వామ్యం కలిగి ఉంది. త్రిశూర్‌లోని సంగీత నాటక అకాడమీలో ఐదురోజులపాటు ప్రతీ సంవత్సరం జరిగే చిత్రోత్సవం దక్షిణాసియాలోనే అతిపెద్ద ప్రత్యామ్నాయ చలన చిత్రోత్సవం. ***'అస్తిత్వాల్ని – భిన్నత్వాల్ని ఆహ్వానించి సంబరాలు జరుపుకుందాం'*** అనేది విబ్‌గ్యోర్ మూలసూత్రం.

***

100 మంచి సినిమాలు

చల్తీ తస్వీరే బృందం 2018 ఫిబ్రవరి 14 నుండి మార్చి 31 వరకూ 45 రోజుల్లో ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, హర్యానా వంటి రాష్ట్రాల్లో ప్రధాన స్రవంతి సంకెళ్ళ నుండి సినిమాని విముక్తి చేద్దాం అనే లక్ష్యంతో ప్రజలతో మమేకమై చేసిన సంచార చలన చిత్రోత్సవాల ప్రదర్శనా యాత్రలో భాగంగా వంద మంచి సినిమాల జాబితా ప్రచురించడం జరిగింది.

ఈ జాబితాలో లేని ఇంకా వందలాది వేలాది మంచి సినిమాలు ఉన్నాయి. అయినప్పటికీ మంచి సినిమాలకు ఒక జాబితా నిర్మించే ఉద్దేశంతో ఈ పట్టికని తయారుచేసారు. సినీరంగ నిపుణులు, అభిమానులు, ప్రేక్షకులు, సామాజిక కార్యకర్తలు, అనుభవజ్ఞుల విలువయిన సలహాలతో ఈ పట్టిక రూపొందింది.

'ఫ్రీ ది ఫిల్మ్' నినాదంతో మొబైల్స్‌లోనూ, లాప్‌టాప్‌ల్లోనూ, మల్టీప్లెక్స్ మాల్స్‌లోనూ మాత్రమే ప్రదర్శించబడే సంకుచిత చిత్రాలకి భిన్నంగా ప్రత్యామ్నాయ సమాంతర చిత్రాల్ని ప్రజానీకం దగ్గరికి తీసికెళ్ళే ప్రయత్నం ఇంత స్థాయిలో స్వచ్ఛందంగా, స్వతంత్రంగా జరగడం వ్యక్తిగతంగా నన్నెంతో అబ్బురపరిచింది. వీటితోబాటుగా తెలుగులో మంచి సినిమాల జాబితా కూడా ప్రచురించాలనుకున్నా కానీ ప్రత్యామ్నాయ సినిమాలనదగ్గవి తెలుగులో జాబితా ప్రచురించే సంఖ్యలో లేవు. భవిష్యత్తులో వస్తాయేమో చూడాలి.

2019 మార్చి 30, 31, ఏప్రిల్ 1 తేదీల్లో సమాచార హక్కు చట్టాన్ని సాధించిన ఉద్యమ సంఘం మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ (ఎమ్.కె.ఎస్.ఎస్.) భౌగోళిక ప్రాంతమయిన రాజస్థాన్‌లోని భీమ్‌లో స్కూల్ ఫర్ డెమోక్రసీ సంస్థ ఆవరణలో జరిగిన మూడ్రోజుల కార్యశాల (వర్క్‌షాప్)లో భాగంగా సినిమా కార్యకర్తల కరదీపికతోపాటు చల్తీ తస్వీరే బృందం యాత్రలో ప్రదర్శించిన ఈ 100 సినిమాల్ని కూడా తెలుగు పాఠకుల కోసం ఇలా అనువదించడం జరిగింది. **- అనువాదకుడు**

వంద సినిమాల వరుసక్రమం

18 ఫీట్

2015/మళయాళం/77 నిమిషాలు/డాక్యుమెంటరీ దర్శకత్వం : రంజిత్ కుజుర్

కరింతలకూటమ్ అనే జానపద దళిత కళాకారుల బృందం పై దేశంలోనే అత్యధిక అక్షరాస్యతా రాష్ట్రం కేరళలో అమలౌతున్న వివక్ష తదితర అంశాల గురించిన సినిమా.

ఎ చైరీ టేల్

1957/ఇంగ్లీష్/9 నిమిషాలు/ఫిక్షన్ దర్శకత్వం : క్లాడ్ జుట్రా & నార్మన్ మెక్లెరెన్

తనపై కూర్చోడానికి ఇష్టపడని, ఒప్పుకోని ఒక కుర్చీ కథ. మానవ స్వభావం గురించీ, రాజకీయాల గురించీ ఆలోచనాత్మక చిత్రం.

అమెరికా అమెరికా

2005 / ఇంగ్లీష్ & మళయాళం / 5 నిమిషాలు / మ్యూజిక్ వీడియో దర్శకత్వం : కె.పి. శశి

ఆగస్ట్ 2005 'హిరోషిమా డే' సందర్భంగా విడుదలయిన ఈ మ్యూజిక్ వీడియో అమెరికన్ ప్రభుత్వ యుద్దోన్మాదం గురించిన వ్యంగ్యాస్త్రం.

అమ్మా ఆర్యన్

1986/మళయాళం/115 నిమిషాలు/ఫిక్షన్ దర్శకత్వం : జాన్ అబ్రహాం

ఒక యువ నక్సలైట్ మరణాన్ని గురించి అతడి స్నేహితులు వాళ్ళ అమ్మలకి తెలియజేస్తూ చనిపోయిన విప్లవకారుడి తల్లికి సమాచారం అందించడానికి చేసే సుదీర్ఘమైన ప్రయాణం.

ఏన్ ఇన్సిగ్నిఫికెంట్ మేన్

2017/హిందీ/96 నిమిషాలు / డాక్యుమెంటరీల దర్శకత్వం : కుషబూ రంకా & వినయ్‌శుక్లా

అరవింద్ కేజ్రీవాల్ రాజకీయాలు, ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో తీసుకొచ్చిన మార్పు గురించి, వారి సిద్ధాంత చైతన్యం గురించిన చిత్రం.

ఎరైవల్

1979 / సైలెంట్ /18 నిమిషాలు / డాక్యుమెంటరీ దర్శకత్వం : మణికౌల్

ఇండియాలో దైనందిన జీవితాల్లో నిత్యం మారుతున్న వ్యక్తులు, సరుకులు, వాణిజ్య సంబంధాలపై ఆలోచనల్ని ప్రేరేపించే చిత్రం.

బంట్‌సింగ్ కెన్ స్టిల్ సింగ్

2006 / పంజాబి / 6 నిమిషాలు / మ్యూజిక్ వీడియో దర్శకత్వం : సంజయ్ కాక్

భారద్దేశంలోని, పంజాబ్‌కి చెందిన బంట్‌సింగ్ విప్లవగాయకుడు. రెండేళ్ళ అతడి పాపని అగ్రకుల ముష్కరులు రేప్ చేసారు. న్యాయంకోసం ప్రయత్నించినందుకు అతడి కాళ్ళూ, చేతులు నరికేసారు. అయినప్పటికీ కృంగిపోకుండా ఆత్మవిశ్వాసంతో ఇప్పటికీ అతడు పాడుతుంటాడు.

బర్ఫ్

1997 / హిందీ / 52 నిమిషాలు / డాక్యుమెంటరీ దర్శకత్వం : సుభా దివాన్

భయం, హింస, వేధింపుల నగర జీవితం నుంచి పర్వతాల్లోకి ప్రయాణించిన ఔత్సాహిక కౌమార యువతుల కథ.

బీయింగ్ బాయిజాన్

2014 / హిందీ / 80 నిమిషాలు / డాక్యుమెంటరీ

దర్శకత్వం : సమ్రాన్ ఫరూకీ షబానీ హసన్‌వాలా

బాలీవుడ్ నటుడు క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న సల్మాన్‌ఖాన్ వివాదం నేపథ్యంతో జూనియర్ సల్మాన్‌గా పిలువబడే షాన్‌ఫోష్ గురించిన చిత్రం. జై సల్మాన్ అనే వాట్సప్‌గ్రూపు నడుపుతున్న ఇతను సల్మాన్‌ఖాన్‌కి నకలుగా ప్రసిద్ధి.

భగత్‌సింగ్ తూ జిందా హై

2012 / హిందీ / 4 నిమిషాలు / మ్యూజిక్ వీడియో గానం : షీతల్ సాథే

కులమతలింగవర్గ అసమానతలతో కూనరిల్లుతున్న బూర్జువా రాజకీయాలపై నిరసనాగాత్రం.

భారత్‌కే నిర్-మాతా

2018/హిందీ/53 నిమిషాలు / డాక్యుమెంటరీ దర్వకత్వం : ఘభం

కుటుంబంతో, కులంతో, మతంతో, రాజ్యంతో, సమాజంతో పోరాటాలు చేసిన ప్రజా ఉద్యమాల్లో భాగమైన మహిళల గురించిన చిత్రం.

బ్లాక్ పాంఫ్లెట్స్

2008 / హిందీ / 83 నిమిషాలు / డాక్యుమెంటరీ దర్శకత్వం : నితిన్

దేశంలోని అతిపెద్ద యూనివర్శిటీగా పేరొందిన ఢిల్లీ విశ్వవిద్యాలయం, దాని ఎన్నికలు, నేటి యువత రాజకీయ దృక్పథాల గురించిన చిత్రం.

బ్లైండ్ స్పాట్

2017 / హిందీ / 12 నిమిషాలు / డాక్యుమెంటరీ సమర్పణ : మీడియా కలెక్టివ్

అలకనంద నదిపై నిర్మిస్తున్న విష్ణుగఢ్ – పీపల్‌కోటీ టన్నల్స్ కారణంగా తలెత్తే పరిణామాలకి చిత్రరూపం.

బ్లడీ ఉమెన్

2018 / హిందీ / 23 నిమిషాలు / డాక్యుమెంటరీ దర్శకత్వం : ప్రియాక ఈశ్వరి

హిమాచల్ ప్రదేశ్‌లోని ఒక ప్రాంతంలో బహిష్టు సమయంలో స్త్రీలపై అమలౌతున్న అంటరానితనం, వివక్షల గురించి చర్చించిన చిత్రం.

కేస్ట్ ఆన్ ది మెనూ కార్డ్

2015 / ఇంగ్లీష్ & హిందీ / 20 నిమిషాలు / డాక్యుమెంటరీ

దర్శకత్వం : అనురూప్ కిలారి, అతుల్ ఆనంద్, వసీం చౌదరి, రీతికా రేవతి సుబ్రహ్మణ్యన్, అనన్యగౌర్

దేశంలో అగ్రవర్ణ ఆహారాధిపత్యం ఎలా చెలామణీ అవుతోందో, శాఖాహార ప్రహసనాన్నెలా పాటిస్తోందో ముంబయిలోని టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ విద్యార్థుల సంవాదం ఆధారంగా రూపొందిన చిత్రం.

చేతన్ అండ్ హిస్ కెమేరా : బ్రింగింగ్ పవర్ టు ది పీపుల్

2017 / హిందీ / 5 నిమిషాలు / వార్తా వీడియో స్వచ్ఛంద కార్యకర్తలు తీసింది

మహారాష్ట్ర సర్దార్ సరోవర్ ప్రాజెక్టు కారణంగా విస్థాపనకు గురయిన సమూహాల కథనం.

చిల్డ్రన్ ఆఫ్ హెవెన్

1999 / పెర్షియన్ / 90 నిమిషాలు / ఫిక్షన్ దర్శకత్వం : మాజిద్ మాజిది

ఒక బీద కుటుంబంలో అలీ – జహరా అన్నా చెల్లి అనుకోకుండా క్లిష్ట పరిస్థితుల్ని ఎదుర్కొని వారికొచ్చిన సమస్యని తల్లిదండ్రులకి చెప్పకుండా పరిష్కరించుకోవాలనుకునే కథ.

దాదా జాగ్ రే

2012 / హిందీ / 8 నిమిషాలు / మ్యూజిక్ వీడియో దర్శకత్వం : మీడియా కలెక్టివ్

కర్ణపుర వ్యాలీలో ప్రకృతి వనరుల కోసం స్థానికుల్ని విస్థాపనకు గురిచేస్తున్న కార్పొరేట్ కంపెనీలకి వ్యతిరేకంగా దీపక్ తన అద్భుత గాత్రానికి ఇచ్చిన చిత్రరూపం.

డిఫెయింట్ సౌండ్ స్కేప్స్

2015 / మళయాళం / 7 నిమిషాలు / మ్యూజిక్ వీడియో దర్శకత్వం : మీడియా కలెక్టివ్

డైనమిక్ యాక్షన్ కేరళలో పనిచేస్తోన్న సాంస్కృతికోద్యమ సంస్థ. 70వ దశకం నుండి ఎంతో పరిశోధించి 500 పై చిలుకు జానపద ప్రజాగేయాల్ని సేకరించింది. ఆ సమిష్టి సంగీత వాద్యాలకి నిరసన సంఘాల స్రవంతికి చిత్రరూపం ఇది.

ఎక్కోస్ ఆఫ్ ది ఫాస్ట్

2015 / హిందీ / 52 నిమిషాలు / డాక్యుమెంటరీ దర్శకత్వం : మెరాజుర్ రహమాన్ బారాహ్

రాజస్థాన్‌లోని బెహరూపియా వంశానికి చెందిన తొమ్మిదో తరం కళాకారుడు సికందర్ అబ్బాస్, ఆరు నెలల చిన్ని కృష్ణుడిగా నటించిన నాటి నుండి అరవయ్యేళ్ళ వరకు కళాకారుడిగా అతని అనుభవాల మేళవింపు ఈ చిత్రం.

ఏక్ అనేక్ ఏక్తా

1974 / హిందీ / 7 నిమిషాలు / ఏనిమేషన్ దర్శకత్వం : భీమ్‌సేన్

ఇండియాలోని జీవనవిధానం, సాంస్కృతిక భిన్నత్వాన్ని ప్రతిబింబించిన ప్రయత్నం.

ఏక్ చోట్ కా మాలిక్

2016 / హిందీ / 46 నిమిషాలు / డాక్యుమెంటరీ దర్శకత్వం : రాజీవ్ మెహరోత్రా

ఉత్తర బీహార్లోని మల్లహ్ కులస్తుల మఖానా ఉత్పత్తికి సంబంధించీ, వారి కష్టనష్టాల్ని చిత్రించిన సినిమా.

ఏక్ ఖూబ్‌సూరత్ జహాజ్

1998 / హిందీ / 19 నిమిషాలు / డాక్యుమెంటరీ దర్వకత్వం : గౌహర్ రజా

భూమి అందమయిన ఓడగా భావించి విశ్వంలోకి వెళ్తుండగా నావికులు అణుబాంబులతో దాన్నెలా ధ్వంసం చేసారనే కథ.

ఏక్ మినిట్ కే మౌన్

1997 / హిందీ / 60 నిమిషాలు / డాక్యుమెంటరీ దర్శకత్వం : అజయ్ భరద్వాజ్

జె.ఎన్.యు. విద్యార్థి చంద్రశేఖర్ తాను నమ్మిన ఆదర్శాలకోసం 31 మార్చి 1997 సివాన్‌లోని జె.పి. చౌక్‌లో హత్యకావించబడ్డాడు. అతని సంస్మరణలో తీసింది ఈ చిత్రం.

ఏక్ రెడ్ కలర్ కీ లవ్ స్టోరీ

2012 / హిందీ / 20 నిమిషాలు / ఫిక్షన్ దర్శకత్వం : అన్నీ జైదీ

కాంక్రీట్ జంగిల్ వంటి ముంబాయి మహానగరంలో ఒంటరితనాన్ని అనుభవిస్తూ సెల్‌ఫోన్లలో అనుభూతులు పంచుకుని అంకితమయ్యే ప్రజల కథాంశం.

ఐస్ ఆఫ్ స్టోన్

1990 / హిందీ / 91 నిమిషాలు / డాక్యుమెంటరీ దర్శకత్వం : నీలితా వాచని

పురుషాధిక్య వ్యవస్థలో రాజస్థాన్‌లోని వో కుగ్రామంలో ఆత్మల్నీ, దెయ్యాల్ని నమ్మిన ఒక యువతి నేపథ్యంగా తీసింది.

ఫేన్ బాబా సాహెబ్ ది

2016 / పంజాబీ / 3 నిమిషాలు / మ్యూజిక్ వీడియో గానం : గిన్నీ మాహి

ఒక దళిత యువతి అస్తిత్వ చిత్రణ

ఫస్ట్ క్రై (ఫెహలీ ఆవాజ్)

2014 / హిందీ / 52 నిమిషాలు / డాక్యుమెంటరీ దర్శకత్వం : అజయ్ టిజి

చత్తీస్‌ఘడ్‌లోని మైనింగ్ ప్రాంతం ధిల్లీరాజ్‌హరాలో రోజువారీకూలీలు, ఆదివాసులు వారి దినభత్యాలన్ని కలిపి నిర్మించిన అద్వితీయమయిన షహీద్ హాస్పటల్ గురించిన సినిమా.

గాడీ లోహర్ దాగా మెయిల్

2006 / హిందీ / 27 నిమిషాలు / డాక్యుమెంటరీ దర్శకత్వం : మేఘనాధ్ & బిజూటోపో

పులియా – రాంచీ నేరోగేజ్ ప్రయాణికులకు విస్తృత సేవలందించి జనవరి 2004లో ఆగిపోయిన పాసింజర్ రైలు కథ.

గావ్ చోడబ్ నహి

2010 / హిందీ / 5 నిమిషాలు / మ్యూజిక్ వీడియో దర్శకత్వం : కె. పి. శశి

భగవాన్ మాజీ రాసిన జానపద గీతం నుంచి స్ఫూర్తి పొంది ఆదివాసుల్ని శతాబ్దాల్నుంచీ వారు జీవిస్తున్న గ్రామాలు, అడవులు, నదులు, ప్రకృతి వనరులు వదిలిపోకుండా పోరాడాలని ఉద్బోధించే అద్భుతమయిన గీతం.

గ్లాస్

1958 / సంగీతం / 11 నిమిషాలు / డాక్యుమెంటరీ దర్శకత్వం : బెర్ట్ హాన్‌స్ట్రా

50వ దశకంలో డచ్‌లోని గాజు తయారీ పరిశ్రమ చిత్రం

గుడ్‌మార్నింగ్ ముంబాయి

2011 / హిందీ / 13 నిమిషాలు / ఏనిమేషన్ దర్శకత్వం : రాజేష్ థాకరే & ట్రోయ్ వసంత్

ముంబాయి మహానగరంలోని పారిశుద్ధ్య సమస్య – అలాగే జనాభా తదితర అంశాలపై తీసిన చిత్రం.

గులాబీ గ్యాంగ్

2012 / హిందీ / 96 నిమిషాలు / డాక్యుమెంటరీ దర్శకత్వం : నిషితాజైన్

ఉత్తరప్రదేశ్‌లోని బాందా జిల్లాలో పురుషహంకారానికి వ్యతిరేకంగా పింక్ శారీలు ధరించి లాఠీలు పట్టిన వీరవనితల కథ.

హమారే ఘర్

2013 / హిందీ / 31 నిమిషాలు / ఫిక్షన్ దర్శకత్వం : కిస్లే గొన్‌జాల్‌వెజ్

రాజ్ – సిమ్రన్‌ల పనిమనిషి కమల కథ. సిమ్రన్ కమలని బాగానే చూసుకుంటుంది. పైకి కనపడని ఆధిపత్యం ఎలా ఉంటుందో తన చెల్లి పిహు వచ్చాక తెల్సుకున్న కమల ఒక నిర్ణయానికెలా వచ్చిందనేదే కథనం.

ఐయామ్ బోణీ

2016 / బెంగాలీ / 45 నిమిషాలు / డాక్యుమెంటరీ

దర్శకత్వం : ఫరాహ్ ఖాతూన్, సత్రూపా సంత్రా, సౌరాబికాంతాదత్తా

బందనా పాల్‌గా పేరొందిన బోణీపాల్ అనే ఫుట్‌బాల్ క్రీడాకారుని కథ. జన్మతః ఇంటర్–సెక్స్ అయిన బోణీపాల్ అసమానతల, సంకుచిత వ్యవస్థలో నిలదొక్కుకోడానికి చేసిన పోరాట రూపం.

ఐయామ్ 20

1967 / ఇంగ్లీష్ – హిందీ / 18 నిమిషాలు / డాక్యుమెంటరీ

దర్శకత్వం : ఎస్.ఎన్.ఎస్. శాస్త్రి

ఆగష్టు 15, 1947 స్వాతంత్ర్యోద్యమం నాడు పుట్టిన దేశంలోని వివిధ ప్రాంతాల వ్యక్తులతో చేసిన ఇంటర్వ్యూల సమాహారం.

ఐ సింగ్, దేర్‌ఫోర్ ఐయామ్

2008 / ఒరియా – కోశి / 19 నిమిషాలు / డాక్యుమెంటరీ

దర్శకత్వం : సుబ్రత్‌కుమార్ సాహు

ప్రపంచంలోని చెడుని చూడలేకపోతున్నందుకు ఆనందిస్తూ, మంచిని అనుభవించడానికి చూపు అవశరం లేదనే పబిత్ర కుంభార్ అనే గాయకుడి కథ.

ఐ వండర్

2009 / హిందీ / 70 నిమిషాలు / డాక్యుమెంటరీ

దర్శకత్వం : అనుపమా శ్రీనివాసన్ & పుష్పారావత్

తమిళనాడు, రాజస్థాన్ మొదలుకుని సిక్కిం వరకూ అనేక స్కూళ్ళలోని పిల్లలు వారి చదువు, ఆటలు, కుటుంబం ఇలా వివిధ సంగతులన్నింటినీ కెమెరా ముందు పంచుకున్న చిత్రం.

ఇన్ ది ఫారెస్ట్ హేంగ్స్ ఏ బ్రిడ్జ్

1998 / ఇంగ్లీష్ / 40 నిమిషాలు / డాక్యుమెంటరీ దర్శకత్వం : సంజయ్ కాక్

అరుణాచల్‌ప్రదేశ్ సియాంగ్ వ్యాలీలోని దారో గ్రామంలో ఏడాదికో వారం రోజులు గ్రామస్తులంతా కలిసి వెయ్యడుగుల వెదురు వంతెన చేస్తారు. ఆదివాసీల సమిష్టి శక్తికి దృశ్యరూపం.

ఇన్ ద షేడ్ ఆఫ్ ఫాలెన్ చీనార్

2016 / హిందీ / 16 నిమిషాలు / డాక్యుమెంటరీ దర్శకత్వం : ఫజిల్ ఎన్.సి. & షాన్ సెబాస్టిన్

కాశ్మీర్లోని యూనివర్శిటీ విద్యార్థి కళాకారులు అక్కడి పరిస్థితులపై స్పందించిన తీరుకి దృశ్యరూపం.

ఇండియా అన్‌టచ్‌డ్

2008 / తమిళం / 108 నిమిషాలు / డాక్యుమెంటరీ దర్శకత్వం : స్టాలిన్. కె

దేశంలో అంటరాని భూతాన్ని ఎనిమిది రాష్ట్రాలు, నాలుగు మతాలతో కళ్ళకు కట్టినట్లు చూపించిన చిత్రం.

ఇజ్జత్‌నగర్ కీ అసభ్య బేటీయా

2011 / హిందీ / 93 నిమిషాలు / డాక్యుమెంటరీ దర్శకత్వం : నకుల్ సింగ్ సహోని

హర్యానాలోని 'ఖాఫ్ పంచాయితీ'ల ఆగడాలు, పరువు హత్యల్ని గురించి కూలంకుషంగా చర్చించిన చిత్రం.

జాదుయి మాఛి

2013 / హిందీ / 37 నిమిషాలు / ఫిక్షన్ దర్శకత్వం : ఏక్‌తారా కలెక్టివ్

జ్యోతిక ఆమె స్నేహితురాళ్లకి నది ఒడ్డున కలిసిన ఒక ముసలి అవ్వ చెప్పిన లోకంలో సంతోషాన్ని నింపిన చేప కథ. అలాంటి చేప నిజంగానే ఉందా?

జైభీమ్ కామ్రేడ్

2012 / హిందీ / 199 నిమిషాలు డాక్యుమెంటరీ దర్శకత్వం : ఆనంద్ పట్వర్ధన్

ముంబాయిలో పదిమంది దళితుల్ని కాల్చి చంపడం జీర్ణించుకోలేని వామపక్ష కవి విలాస్ గోరే ఆత్మహత్యచేసుకున్న నేపధ్యంలో నుంచి అనేక అంశాల్ని గురించి తడిమిన ఈ చిత్రాన్ని 14 సం॥రాలు చిత్రీకరించారు.

జన్ గణ్ మన్ కీ బాత్

2017 / హిందీ / 15 నిమిషాలు / వార్తా వీడియో దర్శకత్వం : ద వైర్

వివిధ రాజకీయ సామాజిక ఆర్థిక వైజ్ఞానిక సంబంధ విశ్లేషణల్ని అనేక సంఘటనల వివరాల్ని తెలియజేసే అంతర్జాల సమాచార వెబ్‌సైట్ ద వైర్.

జరీ మరీ : ఆఫ్ క్లాత్ అండ్ అదర్ స్టోరీస్

2011 / హిందీ / 75 నిమిషాలు / డాక్యుమెంటరీ దర్శకత్వం : సురభిశర్మ

ముంబాయి మహానగరం బట్టమిల్లుల ఆర్థిక పునాదులపైనే నిర్మించబడింది. కంటికి కనబడని కార్మికుల శ్రమే విలాసవంత భవనాలుగా కొద్దిమంది చేతుల్లో ఎలా కేంద్రీకృతమైందో చెప్పే చిత్రం.

కక్కూస్

2017 / తమిళం / 108 నిమిషాలు / డాక్యుమెంటరీ దర్శకత్వం : దివ్యభారతి

2013లోనే ఇండియాలో మాన్యువల్ స్కావెంజింగ్ నిషేధించినా నేటికీ ఎలా కొనసాగుతోందో 25 జిల్లాల్లో సంవత్సరం పాటు చిత్రీకరించిన ఈ సినిమాయే సాక్ష్యం.

కొడైకెనాల్ వోంట్

2015 / ఇంగ్లీష్ / 3 నిమిషాలు / మ్యూజిక్ వీడియో

సంగీతం : సోఫియా అష్రఫ్, దర్శకత్వం : రతీంద్రన్ ఆర్ ప్రసాద్

కొడైకెనాల్‌లోని యునిలివర్ కంపెనీ మెర్క్యూరీ కాలుష్యాన్ని ప్రజలమీదకొదిలి ఎంత నష్టం వాటింపజేసిందో దానికి దృశ్యశ్రవణ రూపం.

లేడీస్ స్పెషల్

2003 / హింది / 30 నిమిషాలు / డాక్యుమెంటరీ దర్శకత్వం : నిధి తులి

ముంబయి లోకల్ రైల్లోని మహిళా ప్రయాణికులు వారికోసం సృష్టించుకున్న వారి ప్రపంచం కథ.

లవ్ యువర్ నైబర్

1952 / సంగీతం / 8 నిమిషాలు / ఫిక్షన్ దర్శకత్వం : నార్మన్ మెక్లరెన్

ఇద్దరు పొరుగువాళ్ళు, గోరంత దానికోసం గొడవపడి చచ్చేదాక కొట్టుకుంటారు. వియత్నాం యుద్ధకాలంలో అమెరికా నిషేధించిన చిత్రం.

మాటీ కీ మాన్

2017 / హింది / 38 నిమిషాలు / డాక్యుమెంటరీ దర్శకత్వం : నిషిదా సాహిర్

కేరళలోని కొల్లాం జిల్లాలో కొల్లత్తుపూజ గ్రామ పంచాయితీ నేపథ్యంగా జరిగిన అరిప్పా భూపోరాటం, దాంట్లో భాగంగా సబు, షీలమ్మల కథ ఈ చిత్రం.

మహువా మెమొరీస్

2007 / హిందీ / 82 నిమిషాలు / డాక్యుమెంటరీ దర్శకత్వం : వినోద్ రాజా

ఆంధ్రప్రదేశ్, ఒడిస్సా, చత్తీస్‌ఘడ్, జార్ఖండ్ రాష్ట్రాల్లో ఆదివాసీల పరిస్థితి, అక్కడి ప్రకృతి వనరుల దోపిడీకి అడ్డాగా ఉన్నందున వారిపై జరుగుతున్న జులుం తాలూకు చిత్రణ.

మై తుమారా కవీ హు

2011 / హిందీ / 40 నిమిషాలు / డాక్యుమెంటరీ దర్శకత్వం : నితిన్ కె

జీవితాంతం జె.ఎన్.యు. క్యాంపస్‌లోనే బతికి, అక్కడే మరణించిన 'విద్రోహి'గా ప్రసిద్ధి చెందిన కవి రమాశంకర్ యాదవ్ గురించిన చిత్రం.

మంజుబెన్ ట్రక్ డ్రైవర్

2002 / హిందీ / 52 నిమిషాలు / డాక్యుమెంటరీ దర్శకత్వం : శరణ దస్తూర్

మంజూబెన్‌గా పేరుమార్చుకుని పురుషుడిగా ఉంటూ ఒక ట్రక్ డ్రైవర్‌తో ప్రయాణించిన అనుభవాలకి దృశ్యరూపం.

మార్చింగ్ విత్ ది భీమ్ ఆర్మీ

2017 / హిందీ / 17 నిమిషాలు / వార్తా వీడియో దర్శకత్వం : ది క్వింట్

యూ.పి. యువ దళిత దళం వారి హక్కుల కోసం పోరాడే క్రమానికి దృశ్యరూపం.

మాయా నగరి

2007 / హిందీ / 17 నిమిషాలు / డాక్యుమెంటరీ

దర్శకత్వం : జర్మా జవేరి & అనురాగ్ సింగ్

న్యూఢిల్లీలోని, సరాయి కాలేకాన్ అనే కార్మికవాడలో ఒక్కరోజు బాల కార్మికుల జీవితాలకి సంబంధించిన కథ.

మేరా అప్నా షహర్

2014 / హిందీ / 56 నిమిషాలు / డాక్యుమెంటరీ దర్శకత్వం : సమీరా జైన్

ఒక నగరం ఎవరికి చెందుతుందనే చర్చతో సాగే కథ. అందులో భాగంగా స్త్రీల సమస్యలు మొదలుకుని వివిధ అంశాల్ని తడుముతుంది..

మిర్చ్ మసాలా

1987 / హిందీ / 128 నిమిషాలు / ఫిక్షన్ దర్శకత్వం : కేతన్ మెహతా

వలసకాలంనాటి కథలో ఒక సుబేదార్‌కీ ఒక గ్రామీణ స్త్రీకి జరిగిన పోట్లాట గురించిన సినిమా.

మిస్సింగ్ రివర్

2018 / తమిళం / 1 నిమిషం / మ్యూజిక్ వీడియో దర్శకత్వం : పి.ఇ.పి. కలెక్టివ్

అనేకమంది మత్స్యకారుల, పేదల, స్త్రీల, చిన్నపిల్లల జీవితాల్ని ప్రశ్నార్థకం చేసే కోస్టల్ రెగ్యులేషన్ జోన్‌కు వ్యతిరేకంగా, చెన్నైలోని కొద్దిమంది పర్యావరణం, శాంతికోసం పనిచేసే కార్యకర్తలదైన పి.ఇ.పి. కలెక్టివ్ కొసస్థలై నది దగ్గర చేపట్టిన నిరసనల చిత్రం.

మోడర్న్ టైమ్స్

1936 / ఇంగ్లీష్ / 87 నిమిషాలు / ఫిక్షన్ దర్శకత్వం : చార్లీ చాప్లిన్

20వ శతాబ్దారంభంలో వచ్చిన ఈ చిత్రం పారిశ్రామీకరణ, దోపిడీ వ్యవస్థలో బతుకీడ్చే ఒక ఫ్యాక్టరీ కార్మికుడి కథ. ఏక సమయంలో హాస్యాన్ని, ఆలోచనని రేకెత్తించేది.

నాటా

2003 / హిందీ / 45 నిమిషాలు / డాక్యుమెంటరీ

దర్శకత్వం : అంజలి మాంటిరో & కె.పి. జయశంకర్

ఆసియాలోనే అతిపెద్ద మురికివాడ ధారవిలో శాంతివేదికలు పెట్టి పనిచేసే భావ్‌కోర్‌డే & వాఖర్ ఖాన్ అనే ఇద్దరు మిత్రులు, సామాజిక కార్యకర్తల కథ.

నిర్ణయ్

2012 / హిందీ / 56 నిమిషాలు / డాక్యుమెంటరీ

దర్శకత్వం : పుష్పారావత్ & అనుపమా శ్రీనివాసన్

ఆధునికంగా చదువుకున్న యువతులు కూడా వారి జీవితాలకి సంబంధించిన నిర్ణయాలు తీసుకునేందుకు ఎలా అర్హులు కాదని పురుషాధిక్య వ్యవస్థ కట్టడి చేస్తుందో, పుష్పా దానినెలా ఎదిరించిందో దృశ్యరూపం.

ఆన్ మై వోన్

2002 / హిందీ / 30 నిమిషాలు / డాక్యుమెంటరీ

దర్శకత్వం : అనుపమ శ్రీనివాసన్

ఢిల్లీలో నివసించే ఐదుగురు ఒంటరి స్త్రీల అనుభవాలు, వారి కుటుంబాల నేపథ్యానికి సంబంధించిన కథ.

ఓరి వుదల్

2015 / మళయాళం / 14 నిమిషాలు / ఫిక్షన్

దర్శకత్వం : ఆషా ఆఛే జోసెఫ్

వోరి ఉదల్ (ఒక దేహం) భౌతికంగా జరిగిన దౌర్జన్యాన్ని జీర్ణించుకోలేని ఒక నన్ కథ.

పాపిలో బుద్ధా

2013 / మళయాళం / 108 నిమిషాలు / ఫిక్షన్దర్శకత్వం : జయేన్ చెరేన్

కులాధిపత్యం పై అసహ్యంతో కొద్దిమంది అంటరానికులాల ప్రజలు బౌద్ధం స్వీకరించే సినిమా.

ప్రింటెడ్ రైన్‌బో

2006 / సైలెంట్ / 15 నిమిషాలు / ఏనిమేషన్ దర్శకత్వం : గీతాంజలి రావ్

మహానగరంలోని అపార్ట్‌మెంట్‌లో జీవించే పెద్దావిడ కథ. ఆమె కలలు, అగ్గిపెట్టెల సేకరణ తదితర అభిరుచులు, అద్భుతమయిన సౌండ్ ట్రాక్, కలర్స్ ఇందులో చూడొచ్చు.

పుష్పవతి : ఆజాదీ

2016 / హిందీ / 5 నిమిషాలు / మ్యూజిక్ వీడియో గానం : పుష్పవతి

విద్యార్థి ఉద్యమ నాయకుడు కన్హయ్యకుమార్ నినాదాలకి మళయాళీ గాయని పుష్పవతి ఇచ్చిన గేయరూపం.

రైట్ టు ఇన్ఫర్మేషన్

1999 / హిందీ / 33 నిమిషాలు / డాక్యుమెంటరీ దర్శకత్వం : జర్నా జవేరి & అనురాగ్ సింగ్

ఎడారి రాష్ట్రమైన రాజస్తాన్‌లో మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ (ఎమ్.కె.ఎస్.ఎస్) సమాచార హక్కు చట్టానికి దారితీసిన పోరాట క్రమాన్ని, అందుకోసం కృషిచేసిన వార్ని గురించీ చిత్రించిన సినిమా.

సద్గతి

1981 / హిందీ / 52 నిమిషాలు / ఫిక్షన్ దర్శకత్వం : సత్యజిత్ రే

1931లో ప్రముఖ రచయిత మున్షీ ప్రేమ్‌చంద్ కథకి దృశ్యరూపం. కులవ్యవస్థ దుర్మార్గానికి ఉదాహరణ.

సాల్ట్ ఆఫ్ ది ఎర్త్

1954 / హిందీ / 94 నిమిషాలు / ఫిక్షన్ దర్శకత్వం : హెర్బర్ట్ జె. బిబర్‌మేన్

జింక్‌మైన్‌లోని మెక్సికన్ కార్మికవర్గం స్ట్రైక్‌చేసి తల్లులు, భార్యలు, అక్కా చెల్లెళ్ళ మద్దతుతో విజయం పొందిన కథ.

సర్పంచ్ పతి

2017 / హిందీ / 6 నిమిషాలు / వార్తా వీడియో

సమర్పణ : వీడియో వాలంటీర్స్

స్థానిక పరిపాలనా విధుల్లో 33% రిజర్వేషన్లు పొంది కూడా సర్పంచులుగా అశక్తులైన బాధిత మహిళల వార్త.

సావిత్రీ'స్ సిస్టర్స్ ఎట్ ఆజాదీ కూచ్

2017 / హిందీ / 20 నిమిషాలు / డాక్యుమెంటరీ దర్శకత్వం : నకుల్‌సింగ్ సహాని

గుజరాత్‌లోని ఊనాలో దళితుల్ని బహిరంగంగా కొరడాలతోకొట్టి హింసించిన సం॥రంలో 'ఆజాదీ కూచ్' (యాత్ర) కి పిలుపివ్వడం జరిగింది. దాన్ని ముందుండి నడిపిన ఇద్దరు దళిత మహిళలు లక్ష్మీబెన్, మధుబెన్‌లని అనుసరించి తీసిన కథనం.

షిట్

2003 / తమిళం / 23 నిమిషాలు / డాక్యుమెంటరీ దర్శకత్వం : అమూదన్ ఆర్.పి.

తమిళనాడులోని మధురైలో మానవ మలాన్ని శుభ్రంచేసే మరియమ్మాల్ ఒకరోజు దినచర్య. దేశంలోని అణగారిన వర్గాలకి, పారిశుద్ధ్య కార్మికులకి సంబంధించీ ప్రశ్నల్ని సంధిస్తుంది.

సీతా'స్ ఫ్యామిలీ

2003 / హిందీ / 60 నిమిషాలు / డాక్యుమెంటరీ దర్శకత్వం : సభాదివాన్

సీత కుటుంబం, తల్లులుగా కూతుర్లుగా వారి స్మృతులతో పంజాబ్ మొదలుకుని ఢిల్లీ వరకూ విస్తరించిన క్రమానికి దృశ్యరూపం.

సమ్‌థింగ్ లైక్ ఏ వార్

1991 / హిందీ / 52 నిమిషాలు / డాక్యుమెంటరీ దర్శకత్వం : దీపా ధన్‌రాజ్

జాతీయ కుటుంబ నియంత్రణ కార్యక్రమాన్ని స్త్రీల కోణంలో నుంచి విమర్శిస్తూ, స్త్రీలని బలిపశువులుగా చేసిన పద్ధతిని కళ్ళకు కట్టినట్లు చిత్రించిన సినిమా.

సాంగ్స్ టు లివ్ బై

2016 / కెటిన్ నాన్‌టంగ్ / డాక్యుమెంటరీ దర్శకత్వం : తరుణ్ భారతీయ్

మేఘాలయ ప్రభుత్వ కళా, సంస్కృతుల శాఖ నిర్మించిన ఈ చిత్రం విభిన్న జానపద కళాకారుల సంగీత వైవిధ్యాలతో కూడిన ఆరు డాక్యుమెంటరీల సమాహారం.

సారీ టు ఇంటరెప్ట్

2012 / జర్మన్ / 13 నిమిషాలు / డాక్యుమెంటరీ దర్శకత్వం : డేవిడ్ లోరెన్జ్

బెర్లిన్ నగరంలో నీడలేని ఒకావిడ వార్తాపత్రికను అమ్ముకోడం అంతా చూస్తారు, మరి ఆమె ఏం చూస్తుంది?

స్టోరీ ఆఫ్ ది స్టఫ్

2009 / హిందీ / 21 నిమిషాలు / వీడియో వ్యాసం దర్శకత్వం : స్టోరీ ఆఫ్ స్టఫ్ ప్రాజెక్ట్

అమెరికన్ ప్రజలు తమ రోజువారీ జీవితంలో వినియోగించే సరుకుల తయారీ ప్రశ్నతో మొదలై ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న వస్తు వినిమయత్వం, వనరుల విధ్వంసం గురించి అద్భుతమైన చిత్రం.

సుందర్ నగరి

2003 / హిందీ / 78 నిమిషాలు / డాక్యుమెంటరీ దర్శకత్వం : రాహుల్‌రాయ్

రాజధాని ఢిల్లీలో నేత కార్మికవాడ సుందర్ నగరి. ప్రపంచీకరణ ప్రభావంతో బతుకులు వెళ్ళదీసే రెండు కుటుంబాల కథ యిది.

సూపర్‌మేన్ ఆఫ్ మాలెగావ్

2008 / హిందీ / 96 నిమిషాలు / డాక్యుమెంటరీ దర్శకత్వం : ఫైజా అహ్మద్‌ఖాన్

మహారాష్ట్రలోని మాలేగావ్‌లో ఆర్థిక అసమానతల్ని మత విద్వేషాల్నీ నిరసిస్తూ శాంతిమయ ఆనందానికీ, సామరస్యతకీ ఇచ్చిన పిలుపు.

టేల్స్ ఫ్రం ది మార్జిన్స్

2006 / ఇంగ్లీష్ & మణిపురి / 20 నిమిషాలు / డాక్యుమెంటరీ దర్శకత్వం : కవితాజోషి

పన్నెండు మంది మహిళలు నగ్నంగా నిరసన తెలిపారు. ఒక స్త్రీ దశాబ్దాలపాటు ఆమరణ నిరాహార దీక్ష చేసింది. ఎందుకు ఈ స్త్రీలు తమ శరీరాల్నే ఆఖరి ఆయుధాలుగా మల్చుకున్నారు? మణిపూర్ ప్రజల మనోభావాలకి, వారిపై జరిగిన ఘోరాలకి దృశ్యరూపం.

ద బాయ్ ఇన్ ద బ్రాంచ్

1993 / హిందీ / 27 నిమిషాలు / డాక్యుమెంటరీ దర్శకత్వం : లలిత్ వచణి

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్.ఎస్.ఎస్.) హిందూ యువకులకి ఇచ్చే శిక్షణను దగ్గరి నుంచి చిత్రించిన సినిమా. దీనికి సీక్వెల్‌గా 'ద మెన్ ఇన్ ద ట్రీ' వచ్చింది.

ది కోరస్ దర్శకత్వం : అబ్బాస్ కియారోస్తమీ

1982 / పర్షియన్ / 17 నిమిషాలు / ఫిక్షన్

ఒక చెవిటి పెద్దాయిన, అతడి మనుమలూ, ముసలాయిన వినికిడి సమస్య గురించిన సరదా కథ.

ది హంట్

2014 / హిందీ / 27 నిమిషాలు / డాక్యుమెంటరీ దర్శకత్వం : బిజూ టోపో

ప్రభుత్వ అభివృద్ధి శిశువుగా జనించిన ఆపరేషన్ గ్రీన్‌హంట్ జార్ఖండ్, చత్తీస్‌ఘడ్, ఒడిస్సా ఆదివాసీలపై సాగిస్తున్న మారణకాండ, మానవ హక్కుల ఉల్లంఘనలకి సంబంధించిన చిత్రం.

ది కిడ్

1921 / ఇంగ్లీష్ / 68 నిమిషాలు / ఫిక్షన్ దర్శకత్వం : చార్లీ చాప్లిన్

వొదిలేయబడిన శిశువు, ట్రాంప్ పాత్ర, నాటకీయ పరిణామాల సమ్మేళనం.

ద లాస్ట్ బోయ్స్ ఆఫ్ ఆర్వల్

2017 / హిందీ / 5 నిమిషాలు / వార్తా వీడియో సమర్పణ : వీడియో వాలంటీర్స్

బీహార్లోని ఆర్వల్ జిల్లా కార్పిబ్లాక్‌లో 2015-16 మధ్య 8-16 వయస్సుగల ఆరుగురు బాలురు అపహరించబడ్డారు. వారిలో ఇద్దరు తప్పించుకుని ఎలాగో వచ్చారు. ఆ ఇద్దరి నేపథ్యంలో తీసిన చిత్రం.

ద మెన్ ఇన్ ద ట్రీ

2002 / హిందీ / 98 నిమిషాలు / డాక్యుమెంటరీ దర్శకత్వం : లలిత్ వచణి

హిందూత్వ సిద్ధాంతం వ్యాప్తిపై తీసిన ద బాయ్స్ ఇన్ ద బ్రాంచ్‌కి అనుసరణ ఈ చిత్రం. స్మృతుల సమాహారం.

ది రెడ్ బెలూన్

1957 / ఫ్రెంచ్ / 34 నిమిషాలు / ఫిక్షన్ దర్శకత్వం : ఆల్బెర్ట్ లేమొరిస్సీ

ఎర్రటి బుడగని కనుగొన్న ఒక బాలుడి సాహసాల – కాల్పనిక కథ.

ది సౌండ్ ఆఫ్ సైలెన్స్

2017 / మళయాళం / 52 నిమిషాలు / డాక్యుమెంటరీ దర్శకత్వం : బినాపాల్

కేరళ విశ్వవిద్యాలయంలోని లింగ వివక్ష గురించీ 'సమాగతి రిపోర్టు' గురించీ అనేక విద్యాలయాల స్త్రీల ప్రత్యక్ష స్పందన.

ద వైట్ బెలూన్

1995 / పర్షియన్ / 85 నిమిషాలు / ఫిక్షన్ దర్శకత్వం : జఫార్ పనాహి

ఒక తల్లి పాపకిచ్చిన డబ్బుకోసం కొందరు ఆమెకి సాయపడే కథ.

టు లివ్ ఫియర్‌లెస్‌లీ అండ్ ఫ్రీ

2017 / ఉర్దూ / 5 నిమిషాలు / వార్తా వీడియో సమర్పణ : వీడియో వాలంటీర్స్

22 ఏళ్ళ ఇన్షా బషీర్‌మిర్, బారాముల్లా మహిళా కళాశాల క్రికెట్ టీంకి కెప్టెన్. క్రికెట్ ఆడుతున్నందుకూ, జీన్స్ వేసుకున్నందుకు చుట్టుపక్కల వారి నుండీ సమాజం నుండీ ఆమె, ఆమె కుటుంబం ఎదుర్కొన్న గడ్డు పరిస్థితుల చిత్రణ.

తూ జిందా హై

1996 / హిందీ / 52 నిమిషాలు / డాక్యుమెంటరీ దర్శకత్వం : షబ్నం వీరమణి

పురుషాధిక్యతకీ, రాజ్యానికీ, మద్యానికీ వ్యతిరేకంగా పోరాడిన మధ్యప్రదేశ్‌లోని ఏక్తాపరిషద్ అనే ప్రజాసంఘానికి చెందిన గ్రామీణ మహిళల కథ.

తురుప్

2017 / హిందీ / 72 నిమిషాలు / ఫిక్షన్ దర్శకత్వం : ఏక్‌తారా కలెక్టివ్

మన దైనందిన జీవితంలో రాజకీయాలు, మీడియా, సమాజం ఎలా ప్రభావం చూపుతాయో అనేక ఆసక్తికర అంశాలతో సమిష్టిగా నిర్మించిన చిత్రం.

ఉపా (UAPA)

2017 / ఇంగ్లీష్ / 9 నిమిషాలు / వీడియోపత్రం దర్శకత్వం : మీడియా కలెక్టివ్

మహారాష్ట్రలోని గడ్చిరోలి పోలీసులు 2017, మార్చి 7న ప్రొఫెసర్ జి.ఎన్. సాయిబాబాని చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (1967) ప్రకారం అరెస్టు చేసారు. రాజ్యాంగంలోని 19వ ఆర్టికల్‌కి ఈ చట్టం ఎలా విరుద్ధమో, అదిచేసి 50 సం॥రాలు అయిన సందర్భంగా చిత్రణ.

అప్, డౌన్ అండ్ సైడ్‌వేస్

2017 / చోక్రి / 83 నిమిషాలు / డాక్యుమెంటరీ దర్శకత్వం : అనుష్క మీనాక్షి & ఈశ్వర్ శ్రీకుమార్

భారత్ – మయన్మార్ సరిహద్దు గ్రామం ఫెక్ నాగలాండ్‌లో ఉంది. సుమారు 5000 మంది నివసించే ఈ గ్రామంలో వారి ఆహార పదార్థాలు, ధాన్యం వారే పండించుకుంటారు. వారి సాంప్రదాయ సంగీత గానాల చిత్రణ.

వాయిస్ ఆఫ్ ది పీపుల్

1974 / హిందీ / 17 నిమిషాలు / డాక్యుమెంటరీ దర్శకత్వం : ఎస్. సుఖ్‌దేవ్

భారద్దేశ పౌరులకు సంబంధించి వివిధ ప్రశ్నలు, అనేక కోణాలను స్పృశించిన ప్రయత్నం.

వెన్ ఉమెన్ యునైట్

1996 / తెలుగు / 80 నిమిషాలు / డాక్యుమెంటరీ దర్శకత్వం : షబ్నం వీరమణి

1995లో అక్షరాస్యతా కార్యక్రమం అంతిమంగా మహత్తర మద్య వ్యతిరేక పోరాటానికి దారితీసిన పరిణామం, ప్రభుత్వానికి, పురుషాధిపత్యానికి విరుద్ధంగా ఉద్యమించిన గ్రామీణ మహిళల తెగువ, ధైర్య సాహసాల చిత్రణ.

వార్డ్స్ ఆన్ వాటర్ (పానీ పే లిఖా)

2002 / హిందీ / 85 నిమిషాలు / డాక్యుమెంటరీ దర్శకత్వం : సంజయ్ కాక్

అసమానతల్ని పెంచి పోషించే అభివృద్ధి నమూనాకి దశాబ్దాలుగా పావులుగా బలౌతోన్న నర్మదాలోయలోని ప్రజల నిరవధిక పోరాటాలు, భారీ డామ్‌లు, ప్రాజెక్టుల కారణంగా జరుగుతున్న విధ్వంసాలకి సంబంధించిన విశ్లేషణకి దృశ్యరూపం.

వై.సి.పి. 1997

1997 / హిందీ / 43 నిమిషాలు / డాక్యుమెంటరీ

దర్శకత్వం : అంజలీ మాంటిరో & కె.పి. జయశంకర్

1865 – 1876 లో నిర్మించబడిన పూణేలోని ఎరవాడ కారాగారం దేశంలోనే అతి పురాతనమైంది. 2500 మందికి పైగా ఖైదీలుండే ఈ జైల్లోని ఆరుగురు కవులు, కళాకారులు స్పందించి పంచుకున్న భావాల మేళవింపు.

జూ

1962 / సంగీతం / 10 నిమిషాలు / డాక్యుమెంటరీ దర్శకత్వం : బెర్ట్ హేన్‌స్ట్రా

జూలో జంతువులకీ, మనుషులకీ ఇరువురి ప్రవర్తనకీ వ్యంగ్య దృశ్యరూపం.

***